ప్రజా
# రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888

పాత్రికేయులు కావలెను
తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న
ప్రజా రిపబ్లిక్
తెలుగు దినపత్రికలో తెలుగు రాష్ట్రాలలో బ్యూరోలు, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ మరియు మండల స్థాయి పాత్రికేయులు కావలెను.
ఆసక్తి గలవారు సంప్రదించండి
9948814188 9985876888

Published From Nandyal : Cerculated in Nandyal,Kurnool,Kadapa,tirupathi,Prakasam, Krishna,Guntur,Nellore and All Distircts

సంపుటి - 03 సంచిక -91 పేజీలు - 8 వెల - 03/- సోమవారం 20 జులై 2026

# బిల్లులు పాసయ్యేనా?



## నేటి నుంచి వర్షాకాల సమావేశాలు

## - పార్లమెంట్ ముందుకు కీలక బిల్లులు

- రసవత్తరంగా సాగనున్న సమావేశాలు
-కేంద్రాన్ని నిలదీసేలా ప్రతిపక్షాల వ్యూహం
-నీట్, అయోధ్య అంశాలపై పోరుకు సిద్ధం
దీటుగా ఎదుర్కొనేందుకు అధికారపక్షం రెడీ
అఖిలపక్ష భేటీలో రగడ.. విపక్షాల వాకౌట్

**న్యూ ఢిల్లీ, జూలై 19( రిపబ్లిక్ న్యూస్) :**
నేటి నుంచిపార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభంకానున్నాయి. సోమవారం నుంచి ఆగస్టు 13 వరకుజరగనున్న ఈ సమావేశాలు దేశ చరిత్రలోకీలకంగా మారనున్నాయి. ముఖ్యంగా కేంద్రండీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ లాంటి కీలకబిల్లులను తీసురాబోతున్నట్లుగా మెజారిటీరాజకీయ పార్టీలు భావిస్తున్నాయి. గతసమావేశాల్లో ఆమోదించు కోలేకపోయిన మోదీసర్కార్ ఈ సెషన్లో వాటిని ఆమోదించుకోవాలనేగట్టి పట్టుదలతో ముందుకు వెళ్తున్నాయి. ఇప్పటికేపార్టీల్లో చీలికలు, ప్రాంతీయ పార్టీల నుంచిఎన్డీఏకు లభిస్తున్న మద్దతుతో మెజార్టీ మార్క్ఉన్నట్లుగా అంచనాతో ఉన్నారు. దీంతో ఈసమావేశాలు రసవత్తరంగాసాగనున్నాయి.



మిగతా 2లో.

# పీవీ సింధు చారిత్రక విజయం

## జపాన్ ఓపెన్ టైటిల్ వశం

## ఫైనల్లో యమగూచిపై ఘన విజయం

**టోక్యో (జపాన్) జూలై 19( రిపబ్లిక్ న్యూస్) :**
భారత అగ్రశ్రేణి షట్లర్, తెలుగు తేజం పి.వి సింధు చరిత్ర సృష్టించింది. జపాన్ ఓపెన్ సూపర్ 750 టైటిల్ సాధించిన తొలి భారత క్రీడాకారిణిగా నిలిచింది. ఆదివారం జరిగిన మహిళల సింగిల్స్ ఫైనల్లో మూడుసార్లు ప్రపంచ చాంపియన్ అకానె యమగూచి (జపాన్)పై 21-17, 21-17తో పి.వి సింధు వరుస గేముల్లో గెలుపొందింది. 50 నిమిషాల టైటిల్ పోరు థ్రిల్లర్‌లో అన్‌సీడెడ్ సింధు అద్భుత విజయం సాధించింది. 2024 సయ్యద్ మోడీ ఇంటర్నేషనల్ (సూపర్ 300) తర్వాత సింధుకు ఇదే తొలి టైటిల్ కాగా.. 2022 సింగపూర్ ఓపెన్ (సూపర్ 500) తెలుగు తేజానికి ఇదే తొలి మేజర్ టైటిల్. 31 ఏండ్ల వయసులో జపాన్ ఓపెన్ విజేతగా నిలిచిన సింధు.. ఈ ఘనత సాధించిన తొలి భారత

మిగతా 2లో.



## జాతీయ పోలీస్ అకాడమీలో లైంగిక వేధింపుల కలకలం..

### ట్రైనీ ఐపీఎస్ పై కేసు

హైదరాబాద్‌లోని జాతీయ పోలీస్ అకాడమీలో దారుణ ఘటన
మహిళా ఐపీఎస్ ట్రైనీపై లైంగిక వేధింపులకు పాల్పడిన సహోద్యోగి
ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డిపై కేసు నమోదు చేసిన పోలీసులు
కత్తితో బెదిరించి, అభ్యంతరకర వీడియోలు తీశాడని బాధితురాలి ఫిర్యాదు
బాధితురాలి భర్తకే ఆ వీడియోలను పంపినట్లు ఆరోపణలు




**హైదరాబాద్‌జూలై 19( రిపబ్లిక్ న్యూస్) :**
దేశంలోనే అత్యున్నత పోలీస్ శిక్షణా కేంద్రమైన హైదరాబాద్ లోని సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ నేషనల్ పోలీస్ అకాడమీ లో ఒక దారుణ ఘటన వెలుగులోకి వచ్చింది. తోటి మహిళా ట్రైనీ ఐపీఎస్ పై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడన్న తీవ్ర ఆరోపణలపై ఉదయ్ కృష్ణారెడ్డి అనే ట్రైనీ ఐపీఎస్‌పై కేసు నమోదైంది. ఈ ఘటన పోలీస్ వర్గాల్లో తీవ్ర కలకలం రేపుతోంది.

మిగతా 2లో.

# లిస్టు రెడీ..

## ఆ ఎమ్మెల్యేలు సర్దుకోవాల్సిందే..

## డిసైడ్ అయిన చంద్రబాబు

**జూలై 19( రిపబ్లిక్ న్యూస్) :**
కట్టుతప్పిన ఎమ్మెల్యేల విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అత్యంత కఠినంగా వ్యవహరించాలని నిర్ణయించారు. రెండేళ్లుగా ఎమ్మెల్యేల పనితీరుపై దిశానిర్దేశం చేస్తున్నా కొందరు ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని, ఇకపై అటువంటి వారిని ఎంత మాత్రం ఉపేక్షించే పరిస్థితి లేదని సీఎం స్పష్టం చేస్తున్నారు. పార్టీ ముఖ్యనేతలతో ఈ విషయమై తన అంతరంగాన్ని సీఎం బయటపెట్టడంతో టీడీపీ వర్గాల్లో హాట్ టాపిక్ అవుతోంది. కొందరు ఎమ్మెల్యేలు ఎన్నిసార్లు చెప్పినా పనితీరు మార్చుకోవడం లేదని, దాంతో వారిని వదిలించుకోవడమే మేలు అన్న నిర్ణయానికి చంద్రబాబు వచ్చారని



మిగతా 2లో.

## జమ్మూ కశ్మీర్‌లో జల ప్రళయం..

### 12 మంది మృతి

భారీ వర్షాలు, ఆకస్మిక వరదలు, విరిగిపడిన కొండచరియలు
పూంచ్, రాజౌరీ జిల్లాల్లో తీవ్ర ఆస్తి నష్టం
నిరసన రద్దు చేసుకుని సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్న సీఎం
ఇంకా పలువురి ఆచూకీ గల్లంతు, కొనసాగుతున్న సహాయక చర్యలు



2లో.

# ప్రైవేటుకు కట్టబెట్టే కుట్ర

రామాయపట్నం పోర్టుపై టీడీపీ ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకున్న జగన్
రూ.4929 కోట్ల ప్రాజెక్టును రూ.1500 కోట్లకే అమ్ముతున్నారని విమర్శ
టీడీపీ పెద్దల జేబులు నింపడానికే ఈ స్కామ్ అంటూ ఘాటు వ్యాఖ్యలు
ఇదేం అర్థశాస్త్రం అంటూ చంద్రబాబును సూటిగా ప్రశ్నించిన జగన్

**జూలై 19( రిపబ్లిక్ న్యూస్) :**
రామాయపట్నం పోర్టు విషయంలో ప్రస్తుత టీడీపీ కూటమి ప్రభుత్వంపై వైసీపీ అధినేత జగన్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్ర భవిష్యత్తుకు అత్యంత కీలకమైన రామాయపట్నం పోర్టును టీడీపీ పెద్దల జేబులు నింపేందుకు ఓ భారీ స్కామ్‌గా మార్చారని, రాష్ట్ర ఖజానాకు వేల కోట్ల



మిగతా 2లో.



2లో.

## తమ్మినేని భూ కబ్జా

2023లో కుమారుడి పేరిట రిజిస్ట్రేషన్
సీతారాం, భార్య, కుమారుడిపై కేసు
యజమాని ఉన్నా ఫేక్ డెత్ సర్టిఫికెట్
తప్పుడు వారసత్వ పత్రాల సృష్టి
బాధితుడి ఫిర్యాదుతో 13 మందిపై కేసు
సహకరించిన సబ్ రిజిస్ట్రార్‌పైనా నమోదు

# సర్ పై దృష్టి

పది రోజులు నియోజకవర్గాల్లో పర్యటించాలి
ఈ నెల 30న పూర్తి స్థాయిలో మళ్లీ సమీక్ష నిర్వహిస్తాం
: సర్ పై జూమ్ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్‌జూలై 19( రిపబ్లిక్ న్యూస్) :**
సర్ గడువును ఆగస్టు 3 వరకు పొడిగించిన నేపథ్యంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ప్రతి ఒక్కరు పది రోజులు నియోజకవర్గాల్లో పర్యటించాలని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. పొడిగింపును ఒక అవకాశంగా తీసుకోవాలని సూచించారు. సర్ పై ప్రతి ఒక్కరు సీరియస్ గా దృష్టి సారించాలన్నారు. హైదరాబాద్ చుట్టూ తిరుగుతూ గాంధీభవన్ కు వస్తామంటే కుదరదని తేల్చి చెప్పారు. అన్ని విషయాలపై ఈ నెల 30న పూర్తి స్థాయిలో మళ్లీ సమీక్ష నిర్వహించి, అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా నివేదికలు స్వీకరిస్తామని



మిగతా 2లో.

# పీవీ సింధు చారిత్రక విజయం

**మొదటిపేజీ తరువాయి**

షట్లర్‌గా రికార్డు నెలకొల్పింది. మిక్సడ్ డబుల్స్‌లో టాప్ సీడ్ చైనా జోడీ ఫెంగ్, పింగ్‌లు విజేతలుగా నిలువగా.. పురుషుల సింగిల్స్‌లో క్రిస్టో పాపొవ్ (ఫ్రాన్స్) టైటిల్ సాధించాడు. మహిళల డబుల్స్‌లో కిమ్, కాంగ్ (దక్షిణ కొరియా), పురుషుల డబుల్స్‌లో ఫజర్, ఫిక్రి (ఇండోనేషియా) చాంపియన్లుగా అవతరించారు.నువ్వా..నేనా

మహిళల సింగిల్స్ ఫైనల్ హోరాహోరీగా సాగింది. లోకల్ స్టార్ యమగూచి ఈ ఏడాది సింధుపై ఆడిన రెండు మ్యాచుల్లోనూ గెలుపొందింది. సింధు వరుసగా క్వార్టర్స్, సెమీఫైనల్లో ప్రత్యర్థుల వాకోవర్ ఇవ్వటంతో చెమటపట్టకుండా ఫైనల్‌కు చేరుకుంది. రెండు సార్లు ఒలింపిక్ పతక విజేత సింధు.. టైటిల్ పోరులో సత్తా చాటింది. తొలి గేమ్‌లో 3-0తో మందంజ వేసింది. యమగూచి పుంజుకుని 5-5తో స్కోరు సమం చేసినా సింధు 9-6తో మెరిసింది. విరామ సమయానికి 9-11తో సింధు వెనుకంజ వేసింది. కానీ విరామం తర్వాత సింధు రెచ్చిపోయింది. వరుస పాయింట్లు సాధించింది. 12-12తో స్కోరు సమం చేయటంతో పాటు 16-12, 17-15తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. 38 షాట్ల సుదీర్ఘ ర్యాలీలో పైచేయి సాధించిన యమగూచి 17-17తో సమవుజ్జీగా నిలిచింది. కానీ, ఇక్కడ కచ్చితమైన స్మాష్‌లు, క్రాస్ కోర్టు డ్రాప్స్‌తో సింధు వరుసగా నాలుగు పాయింట్లు ఖాతాలో వేసుకుంది. తొలి గేమ్‌ను 21-17తో సొంతం చేసుకుంది. కీలక రెండో గేమ్‌లోనూ సింధు జోరు తగ్గలేదు. యమగూచిపై ఎదురుదాడి చేస్తూ పాయింట్లు సాధించింది. 8-3, 14-7తో ముందంజలోకి దూసుకెళ్లింది. యమగూచి 17-19తో రేసులోకి వచ్చే ప్రయత్నం చేసినా.. సింధు 21-17తో రెండో గేమ్‌తో పాటు జపాన్ ఓపెన్ టైటిల్‌ను ఎగరేసుకుపోయింది.

# జాతీయ పోలీస్ అకాడమీలో లైంగిక వేధింపుల కలకలం..

**మొదటిపేజీ తరువాయి**

వివరాల్లోకి వెళితే, అకాడమీలో శిక్షణ పొందుతున్న ఒక ఐపీఎస్ ప్రొబేషనర్, తన సహోద్యోగి అయిన ఉదయ్ కృష్ణారెడ్డి తనను కొంతకాలంగా వేధిస్తున్నాడని అత్తాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితుడు తనకు అసభ్యకరమైన మెసేజ్‌లు పంపడంతో పాటు, మానసికంగా వేధిస్తూ, దుర్భాషలాడుతున్నాడని ఆమె తన ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఈ క్రమంలో జూలై 9న నిందితుడు తనను బలవంతంగా ఒక గదిలోకి లాక్కెళ్లాడని, జుట్టు పట్టుకుని మెడపై కత్తి పెట్టి బెదిరించాడని బాధితురాలు ఆరోపించారు. అంతేకాకుండా, ఆమె ప్రైవేట్ వీడియోలను బలవంతంగా చిత్రీకరించి, ఆమె మొబైల్ ఫోన్ లాక్కుని, ఆ వీడియోలను ఆమె భర్త వాట్సాప్‌కు పంపాడని ఫిర్యాదులో వివరించారు.బాధితురాలి ఫిర్యాదు స్వీకరించిన అత్తాపూర్ పోలీసులు, నిందితుడు ఉదయ్ కృష్ణారెడ్డిపై భారతీయ న్యాయ సంహిత (BNS)లోని సెక్షన్లు 74, 75, 77, 315(2)తో పాటు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చట్టంలోని సెక్షన్ 66(C) కింద కేసు నమోదు చేశారు.

# తమ్మినేని భూ కబ్జా

**శ్రీకాకుళం, జూలై 19( రిపబ్లిక్ న్యూస్) :**

గత వైసీపీ పాలనలో ఆ పార్టీ నేతలు చేసిన అక్రమాలు బయటపడుతూనే ఉన్నాయి. స్పీకర్‌గా పనిచేసిన వైసీపీ నేత తమ్మినేని సీతారాం, ఆయన కుటుంబ సభ్యులు 4 కోట్ల రూపాయల విలువ చేసే భూమిని కబ్జా చేశారు. భూ యజమాని బతికుండగానే చనిపోయినట్టుగా మరణ ధ్రువీకరణ పత్రాలు సృష్టించారు. నకిలీ వారసులను చూపి తప్పుడు పత్రాలతో తమ్మినేని కుమారుడి పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఈ వ్యవహారంలో సబ్ రిజిస్ట్రార్ వంత పాడారు. ఇదంతా గత వైసీపీ ప్రభుత్వ హయాంలో 2023లో ఆయన స్పీకర్‌గా ఉన్నప్పుడే జరిగింది. ఇటీవల బాధితుడి ఫిర్యాదుతో కబ్జా బాగోతం వెలుగులోకి వచ్చింది. శ్రీకాకుళం రూరల్ పోలీస్ స్టేషన్‌లో తమ్మినేని సీతారాం (ఏ6)తో పాటు ఆయన భార్య తమ్మినేని వాణి (ఏ7), కుమారుడు తమ్మినేని వెంకట శ్రీరామ చిరంజీవి నాగ్ (ఏ5)పై కేసు నమోదు చేశారు. ఆదివారం శ్రీకాకుళం జిల్లా పోలీస్ కార్యాలయంలో మీడియా సమావేశంలో ఎస్పీ మహేశ్వరరెడ్డి వివరాలు వెల్లడించారు. ఈ కేసులో మొత్తం 13 మంది ప్రమేయం ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. 8 మందిని అరెస్టు చేసి న్యాయస్థానం ముందు హాజరు పరిచారు. నిందితుల నుంచి నకిలీ రబ్బరు స్టాంపులు, మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. తమ్మినేని కుటుంబ సభ్యులతో పాటు మరో ఇద్దరు పరారీలో ఉన్నట్టు ఎస్పీ వెల్లడించారు. తమ్మినేని సీతారాం, తమ్మినేని వాణి, తమ్మినేని వెంకట శ్రీరామ చిరంజీవి నాగ్ (నాని), ఏ13 బొడ్డేపల్లి అరుణ (ప్రస్తుత హిరమండలం సబ్ రిజిస్ట్రార్), ఏ4 త్రినాథ్ కోసం గాలిస్తున్నామని, త్వరలోనే అరెస్టు చేస్తామని తెలిపారు.

ఎస్పీ తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. శ్రీకాకుళం రూరల్ పరిధిలోని చాపురం గ్రామ పంచాయతీ బలగ పరిధిలో సర్వే నంబర్ 35/13లో ఉన్న 84, 85, 86 ప్లాట్లను (900 గజాల స్థలం) అంధవరపు గోవిందరాజులు అనే వ్యక్తి నుంచి కట్టా కనకలింగేశ్వరరావు అనే వ్యక్తి 1988, 1992లో రెండు దఫాలుగా కొనుగోలు చేశారు. లింగేశ్వరరావు కుటుంబం ఉద్యోగ రీత్యా హైదరాబాద్‌లో స్థిరపడింది. ఆ స్థలం చాలా కాలంగా ఖాళీగా ఉంటోంది. ప్రస్తుతం ఆ స్థలం విలువ రూ.3-4 కోట్లు ఉంటుంది. ఆ ఖాళీ స్థలంపై నిందితుల కన్ను పడింది. కనక లింగేశ్వరరావుకు భూమిని విక్రయించిన అంధవరపు గోవిందరాజుల లింక్ డాక్యుమెంట్‌లను పైకి తీశారు. గోవిందరాజులు బతికి ఉండగానే.. ఆయన చనిపోయినట్లు తప్పుడు మరణ ధ్రువీకరణ పత్రాన్ని సృష్టించారు. వాస్తవానికి గోవిందరాజులుకు ఇద్దరు కొడుకులు, ఒక కుమార్తె ఉన్నారు. అయితే ఒడిశాలోని జయపుర్ ప్రాంతానికి చెందిన అడబాల రజనిని తెరపైకి తెచ్చారు. 'ఎ.రజని'గా రికార్డుల్లో చూపించి గోవిందరాజులకు ఏకైక వారసురాలుగా రెవెన్యూ అధికారుల నుంచి వారసత్వ ధ్రువీకరణ (ఫ్యామిలీ మెంబర్) పత్రాన్ని తయారు చేయించారు. వీటితో తప్పుడు రిజిస్ట్రేషన్ పత్రాలను రూపొందించారు. ఆమదాలవలస సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో తమ్మినేని సీతారాం కుమారుడు తమ్మినేని చిరంజీవి నాగ్‌కు విక్రయించినట్లు రిజిస్ట్రేషన్ చేయించారు. తమ్మినేని సీతారాంకు చెందిన ఆమదాలవలసలోని ప్రైవేటు కళాశాలలో పనిచేస్తున్న నలుగురు లెక్చరర్లను ఇందుకు సాక్షులుగా సంతకం చేయించారు. ఇదంతా 2023లో జరిగింది. ఇటీవల ఆ స్థలానికి ప్రహరీ నిర్మించేందుకు యత్నించగా.. అసలు యజమాని కనకలింగేశ్వరరావు కుమారుడు కట్టా జైకిశోర్ పోలీసులను ఆశ్రయించారు. తమ వద్ద ఉన్న ఒరిజనల్ పత్రాలను పోలీసులకు సమర్పించారు. దీంతో పోలీసులు విచారణ చేపట్టి అసలు గుట్టు రట్టు చేశారు.

# లిస్టు రెడీ..

**మొదటిపేజీ తరువాయి**

సీనియర్లు చెబుతున్నారు. కొత్తగా ఎన్నికైన వారితోపాటు కొందరు సీనియర్ల పనితీరు నిరాశజనకంగా ఉందని సీఎం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఆయా ఎమ్మెల్యేలకు చెప్పినా వారు మారడం లేదన్నట్లు అధినేత భావిస్తున్నారు. వాళ్లతో పాటే అందరినీ ముంచేస్తారని ఆందోళన చెందుతున్న చంద్రబాబు 2029 ఎన్నికలకు 1999 ఫార్ములా తీసుకువస్తానని తాజాగా జరిగిన ఎంపీల సమావేశంలో స్పష్టం చేసినట్లు ప్రచారం జరుగుతోంది. పార్లమెంటరీ పార్టీ సమావేశం సందర్భంగా ఎమ్మెల్యేలు, ఎంపీల పనితీరుపై చర్చ జరిగిందని, కొందరు ఎమ్మెల్యేలు తమ మాట వినడం లేదని సీనియర్ ఎంపీలు చెప్పగా సీఎం ఘాటుగా స్పందించినట్లు చెబుతున్నారు. ాశ్రీంశీ =ఘ౹ం - భార్యల చేతిలో 554 మంది భర్తలు ఖతం.. కలియుగంలో ఇదో దారుణం ాంజవతీఅంవఎవత్ పార్టీకి మంచి జరిగేలా అందరూ నడుచుకోవాలని, ఈ విషయంలో ఎలాంటి మొహమాటలకు తావు లేదని చంద్రబాబు వ్యాఖ్యానించినట్లు చెబుతున్నారు. పార్టీకి నష్టం చేస్తున్న వారికి ఇప్పటికే పలుమార్లు హెచ్చరించామని, ఇకపై అటువంటి మాటలు ఉండవని సీఎం తేల్చిచెప్పారని అంటున్నారు. దీంతో పార్టీలో వివాదాలు, విమర్శలు ఎదుర్కొంటున్న పలువురు ఎమ్మెల్యేలకు కౌంట్ డౌన్ మొదలైనట్లేనని వ్యాఖ్యానిస్తున్నారు. ఇకపై వారికి ఎటువంటి అవకాశం ఇవ్వమని చెప్పడం ద్వారా పార్టీలో ప్రభుత్వంలో ఆయా ఎమ్మెల్యేల ప్రాధాన్యం తగ్గించడమే కాకుండా వారిస్థానంలో ప్రత్యామ్నాయ నేతలను ప్రోత్సహించే పరిస్థితి ఉందని చెబుతున్నారు.

# జమ్మూ కశ్మీర్‌లో జల ప్రళయం..

**జూలై 19( రిపబ్లిక్ న్యూస్) :**

జమ్మూ కశ్మీర్‌లోని సరిహద్దు జిల్లాలు పూంచ్, రాజౌరీలలో ఆదివారం కురిసిన కుండపోత వర్షాలు తీవ్ర విషాదాన్ని మిగిల్చాయి. ఆకస్మిక వరదలు, కొండచరియలు విరిగిపడటంతో మొత్తం 12 మంది మరణించారు. ఇంకా పలువురి ఆచూకీ తెలియరాలేదు. ఈ ప్రకృతి విపత్తు కారణంగా వందలాది ఇళ్లు, పాఠశాలలు ధ్వంసమవగా, భారీగా ఆస్తి నష్టం సంభవించింది.

అధికారుల వివరాల ప్రకారం, పూంచ్ జిల్లాలో 9 మంది మృతి చెందగా, మరో ముగ్గురు గాయపడ్డారు. రాజౌరీ జిల్లాలో ముగ్గురు ప్రాణాలు కోల్పోగా, ఇద్దరు గల్లంతయ్యారు, ఒకరు గాయపడ్డారు. గల్లంతైన వారి కోసం ఆర్మీ, పోలీసులు, స్థానిక బృందాలు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టాయి. ముఖ్యంగా పూంచ్ జిల్లాలోని సురన్‌కోట్ తహసీల్‌లో నష్టం తీవ్రంగా ఉంది.

ఈ రెండు జిల్లాల్లో కలిపి 130కి పైగా ఇళ్లు, 18 పాఠశాలలు, అనేక వాహనాలు దెబ్బతిన్నాయి. కొన్ని ప్రాంతాల్లో మొబైల్ కనెక్టివిటీ పూర్తిగా స్తంభించిపోయింది. వందలాది ఇళ్లకు తాగునీటి సరఫరా నిలిచిపోయింది. సుమారు 127 కనాల్స్ విస్తీర్ణంలో పంట నష్టం వాటిల్లినట్లు ప్రాథమిక అంచనా.విషయం తెలియగానే ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ఢిల్లీలో తలపెట్టిన తన నిరసన కార్యక్రమాన్ని రద్దు చేసుకుని హుటాహుటిన జమ్మూకు చేరుకున్నారు. ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించి సహాయక చర్యలను సమీక్షించారు. బాధితుల ప్రాణాలను కాపాడటమే తమ ప్రథమ ప్రాధాన్యత అని ఆయన స్పష్టం చేశారు. లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా, ఇతర రాజకీయ నేతలు ఈ ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసి, మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. సహాయక చర్యలు కొనసాగుతున్నాయని, బాధితులను ఆదుకోవడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని అధికారులు తెలిపారు.

# ప్రైవేటుకు కట్టబెట్టే కుట్ర

**మొదటిపేజీ తరువాయి**

రూపాయల నష్టం కలిగించేందుకు సిద్ధమయ్యారని ఆయన సంచలన ఆరోపణలు చేశారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదికగా ఒక పోస్ట్ చేస్తూ ప్రభుత్వంపై ఘాటు విమర్శలు గుప్పించారు.

**మా హయాంలో పురోగతి... ఇప్పుడు ప్రైవేటుపరం**

నవ్యాంధ్రప్రదేశ్ ఆర్థికాభివృద్ధికి పోర్టులే కీలకమని భావించిన తమ ప్రభుత్వం, రామాయపట్నం, మచిలీపట్నం, మూలపేట పోర్టుల నిర్మాణంలో గణనీయమైన పురోగతి సాధించిందని జగన్ గుర్తుచేశారు. ఈ మూడు పోర్టులకు సంబంధించి భూసేకరణ, అన్ని రకాల చట్టబద్ధమైన అనుమతులు, ఆర్థిక వనరుల సమీకరణ వంటి అత్యంత క్లిష్టమైన పనులన్నీ తమ హయాంలోనే పూర్తయ్యాయని ఆయన వివరించారు. ప్రాజెక్టుల పూర్తి కోసం ఈపీసీ కాంట్రాక్టులను కూడా ఖరారు చేసి, 2024 జూన్ నాటికి నిర్మాణ పనుల్లో చెప్పుకోదగ్గ పురోగతిని సాధించామని తెలిపారు. ఇంత కష్టపడి ఒక రూపు తీసుకొచ్చిన పోర్టును ఇప్పుడు టీడీపీ ప్రభుత్వం అప్పనంగా ప్రైవేటుపరం చేసేందుకు కుట్ర పన్నుతోందని ఆయన ఆరోపించారు.

**పోర్టుతో ముడిపడిన భారీ ప్రాజెక్టులు**

రామాయపట్నం పోర్టు వల్ల రాష్ట్రానికి అపారమైన ఆర్థిక ప్రయోజనాలు చేకూరనున్నాయని జగన్ తన పోస్టులో ప్రస్తావించారు. భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్) సుమారు రూ.1 లక్ష కోట్లకు పైగా పెట్టుబడితో ఏర్పాటు చేయనున్న గ్రీన్‌ఫీల్డ్ రిఫైనరీ, పెట్రోకెమికల్ కాంప్లెక్స్ పూర్తిగా రామాయపట్నం పోర్టుపైనే ఆధారపడి ఉందని తెలిపారు. ముడి చమురు దిగుమతికి ఈ పోర్టు కీలకం కానుందన్నారు.

అలాగే, ఇండోసోల్ సోలార్ సంస్థ ఏర్పాటు చేయనున్న గిగా స్కేల్ తయారీ ప్లాంటుకు కూడా ఈ పోర్టే ఆధారం అని తెలిపారు. ముడిసరుకుల దిగుమతికి, తయారైన సోలార్ మాడ్యూళ్ల ఎగుమతికి ఈ డీప్ వాటర్ పోర్టు అత్యంత అవసరమని పేర్కొన్నారు.వీటితో పాటు, వైఎస్సార్ కడప జిల్లాలో జేఎస్‌డబ్ల్యూ స్టీల్ నిర్మిస్తున్న ఉక్కు కర్మాగారానికి అవసరమైన ముడి ఇనుము, కోకింగ్ కోల్ వంటివి దిగుమతి చేసుకోవడానికి రామాయపట్నం పోర్టులో ఆ సంస్థ రెండు బెర్తులను అభివృద్ధి చేస్తోందని గుర్తుచేశారు. ఈ ప్రాజెక్టులన్నీ వేలాది మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కల్పించడమే కాకుండా, రాష్ట్రానికి పన్నుల రూపంలో భారీ ఆదాయాన్ని సమకూరుస్తాయని జగన్ వివరించారు.

**రూ.3,500 కోట్ల నష్టానికి అమ్మకం**

ఇన్ని ఆర్థిక ప్రయోజనాలున్న రామాయపట్నం పోర్టును టీడీపీ ప్రభుత్వం ఓ భారీ స్కామ్‌గా మార్చేందుకు ప్రయత్నిస్తోందని జగన్ తీవ్రంగా ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.4,929 కోట్లు ఖర్చు చేసి నిర్మిస్తున్న ఈ పోర్టును, కేవలం రూ.1,500 కోట్ల ముందస్తు చెల్లింపులకే ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టాలని చూస్తోందని ఆయన విమర్శించారు. దీనివల్ల రాష్ట్ర ఖజానాకు తీరని నష్టం వాటిల్లుతుందని, మిగిలిన రూ.3,500 కోట్లకు పైగా అప్పుల భారాన్ని రాష్ట్ర ప్రభుత్వమే మోయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ పెద్దలకు నగదు ప్రవాహాలు సృష్టించడమే ఈ కుట్ర వెనుక ఉన్న అసలు లక్ష్యమని ఆయన ధ్వజమెత్తారు.

# బిల్లులు పాసయ్యేనా

పార్లమెంట్ వర్షాకాల సమావేశాలకు కొన్ని గంటల ముందు కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో గందరగోళం చెలరేగింది. తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) రెబల్ ఎంపీలకు ఆహ్వానం పలకడాన్ని నిరసిస్తూ విపక్ష పార్టీల నేతలు సమావేశం నుంచి వాకౌట్ చేశారు. అయితే, ఇది కేవలం సాంకేతిక నిరసన మాత్రమేనని తెలిపి, కొద్ది నిమిషాలకే తిరిగి సమావేశంలో పాల్గొన్నారు.

సోమవారం నుంచి ప్రారంభం కానున్న పార్లమెంట్ సమావేశాల అజెండాను చర్చించేందుకు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. సమావేశం మొదలైన వెంటనే కాంగ్రెస్, టీఎంసీ, సమాజ్‌వాదీ పార్టీ, డీఎంకే, ఆప్, శివసేన (యూబీటీ) సహా పలు విపక్ష పార్టీల నేతలు నిరసనగా బయటకు వెళ్లిపోయారు.

టీఎంసీ నుంచి తిరుగుబాటు చేసిన సుమారు 20 మంది ఎంపీలు నేషనలిస్ట్ సిటిజన్స్ పార్టీ ఆఫ్ ఇండియా (ఎన్‌సీపీఐ)లో చేరారు. అయితే, ఈ విలీనానికి లోక్‌సభ స్పీకర్ నుంచి అధికారికంగా ఎలాంటి ఆమోదం లభించలేదని, పార్లమెంట్ రికార్డుల్లో వారు ఇంకా టీఎంసీ ఎంపీలుగానే ఉన్నారని విపక్షాలు వాదించాయి. పార్లమెంట్ వెబ్‌సైట్‌లో ఎన్‌సీపీఐ అనే పార్టీయే లేనప్పుడు వారిని ఎలా ఆహ్వానిస్తారని టీఎంసీ ఎంపీ సౌగతా రాయ్ ప్రశ్నించారు. ఇది నిబంధనలను ఉల్లంఘించడమేనని విపక్షాలు ఆరోపించాయి.

ఈ పరిణామంపై కేంద్రమంత్రి కిరణ్ రిజిజు స్పందిస్తూ.. స్పీకర్ వద్ద గుర్తింపు కోసం దరఖాస్తు చేసుకున్న పార్టీలను ఆహ్వానించడం తమ బాధ్యత అని తెలిపారు. మరోవైపు, తమకు ఆహ్వానం అందడాన్ని ఎన్‌సీపీఐ నేత కకోలి ఘోష్ దస్తిదార్ స్వాగతించారు. ఈ ఘటనతో వర్షాకాల సమావేశాలు వాడివేడిగా సాగే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ సమావేశాల్లో నీట్ పరీక్షల లీకేజీలు, వ్యవసాయ సమస్యలు, రామాలయ విరాళాల అంశాలను లేవనెత్తాలని విపక్షాలు సిద్ధమవుతున్నాయి.

# ప్రయివేటు యూనివర్సిటీలు ఎందుకు పెట్టారు?

**వాటి లక్ష్యాలు ఏంటి?**

**బోధనా సిబ్బంది విద్యార్హతలు..**

**ఎంట్రన్స్‌కు ఉన్న నిబంధనలేమిటి?**

**ప్రయివేట్ యూనివర్సిటీల ఏర్పాటుపై రాష్ట్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు ప్రశ్నలు**

**పూర్తి వివరాలతో అఫిడవిట్ సమర్పించాలని ఆదేశం**

**సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాలతో యూనివర్సిటీల్లో తనిఖీలు**



**హైదరాబాద్‌జూలై 19( రిపబ్లిక్ న్యూస్) :**

పెద్ద సంఖ్యలో ఏర్పాటవుతున్న ప్రయివేటు యూనివర్సిటీల వెనుక ఉన్న అసలు ఉద్దేశాలు, వాటిని ఏర్పాటు చేస్తున్న సంస్థలు/ వ్యక్తుల అసలు లక్ష్యాలు ఏమిటి..? ఆ యూనివర్సిటీల్లో బోధిస్తున్న వారికి ఉన్న విద్యార్హతలు ఏమిటి అనే దానిపై సర్వోన్నత న్యాయస్థానం దృష్టి సారించింది. అయేషా జైన్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసు విచారణలో తన దృష్టికి వచ్చిన అనేక ఫిర్యాదులను పరిశీలించిన సుప్రీంకోర్టు దేశవ్యాప్తంగా ప్రయివేట్ యూనివర్సిటీల్లో తనిఖీలకు ఆదేశం చింది. ప్రయివేట్ యూనివర్సిటీలు ఏకపక్షం గా వ్యవహరిస్తుండడంతో అసలు వాటి ఏర్పాటు వెనుక ఉన్న ఉద్దేశాలు మొదలు వాటిలో అందుతున్న విద్యా ప్రమాణాల స్థాయి వరకు ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసి పూర్తి వివరాలతో అఫిడవిట్లు సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయివేటు యూనివర్సిటీల్లో తనిఖీల కోసం కాలేజీయేట్ ఎడ్యుకేషన్ చైర్మెన్ అధ్యక్షతన ఒక కమిటీని నియమించింది. ఈ కమిటీలో కన్వీనర్‌గా తెలంగాణ ఉన్నత విద్యా మండలి కార్యదర్శి, సభ్య కన్వీనర్‌గా జేఎన్‌టీయూ రిజిస్ట్రార్, సభ్యులుగా పాలమూరు యూనివర్సిటీ రిజిస్ట్రార్, ఉస్మానియా యూనివర్సిటీ చీఫ్ ఫైనాన్స్ అండ్ అకౌంట్స్ ఆఫీసర్, టెక్నికల్ ఎడ్యుకేషన్ విద్యా కమిషనర్ అసిస్టెంట్ డైరెక్టర్ (అకడమిక్-సి)లను నియమించింది.

అవసరమైతే ఒక సబ్జెక్ట్ ఎక్స్‌పర్ట్‌ను నియమించుకునే అవ కాశాన్ని కమిటీకి రాష్ట్ర ప్రభుత్వం కల్పించింది.

# సర్ పై దృష్టి

ఆయన తెలిపారు. ఆదివారం టీపీసీసీ అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్ అధ్యక్షతన సర్ పై నిర్వహించిన జూమ్ సమావేశంలో ఆయన మాట్లాడారు. సర్ ప్రక్రియను తేలిగ్గా తీసుకోవద్దని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో 119 నియోజకవర్గాల్లో ఎస్ఐఆర్‌పై 489 సమావేశాలు జరిగాయని సీఎం తెలిపారు. బాగా వెనుకబడిన నియోజకవర్గాల్లో ఇప్పటికైనా స్పందించాలని సూచించారు. చైర్మెన్ పదవులు, పార్టీ పోస్టులు కావాలని గాంధీభవన్ చుట్టూ తిరగొద్దని ఆశావహులను కోరారు. అలాంటి వారికి అపాయింట్‌మెంట్లు ఇవ్వొద్దని నాయకులకు దిశా నిర్దేశం చేశారు. కొందరు నాయకులు హైదరాబాద్‌లో కూర్చొని పనిచేయడం లేదని ఆయన తప్పుపట్టా రు. సోమవారం పది మంది ఇంచార్జి మంత్రు లు అన్ని జిల్లాల్లో సర్ పై సమీక్షా సమావేశాలు నిర్వహిస్తారని సీఎం వెల్లడించారు.

పార్లమెంట్ సమావేశాల్లో ఉన్నప్పటికీ ఎంపీలు ఎప్పటికప్పుడు సమీక్షలు జరపాలన్నారు. ఇంచార్జిలుగా వ్యవహరిస్తున్న చోట ఎంపీలు పనిచేయకపోతే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. పార్టీ పరంగా సర్ ఇంచార్జిలుగా ఉన్నవారు ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకోవాలని సూచించారు.ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇంచార్జిలు, చైర్మెన్లు బీఎల్‌ఓల రిపోర్టుల కంటే బీఎల్‌ఏల రిపోర్టులను ఎక్కువగా పరిశీలించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. బీఎల్‌ఓల రిపోర్టుల మీద మాత్రమే ఆధారపడితే కఠిన చర్యలు ఉంటాయని ఆయన హెచ్చరించారు. పార్టీ పరంగా పని చేస్తున్న బీఎల్‌ఏలను నాయకులు సమర్థవంతంగా ఉపయోగించుకోవాలని కోరారు. ప్రతి ఒక్కరు పూర్తిగా క్షేత్రస్థాయిలో ఉండాల్సిందేనని స్పష్టం చేశారు. వచ్చే పది రోజులు ఎన్నికల ప్రచారం తరహాలో నియోజకవర్గాల్లో పర్యటించాలనీ, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇంచార్జిలు, కార్పొరేషన్ చైర్మెన్లు, సర్ కోసం నియమించిన పార్టీ ఇంచార్జిలు అందరూ క్షేత్రస్థాయిలో పర్యటించాల్సిందేనని తేల్చి చెప్పారు.

# ఇండస్ ఆసుపత్రి ప్రారంభోత్సవం

## అత్యాధునిక ఆర్థోపెడిక్ వైద్య సేవలు అందిస్తాం -డాక్టర్ మదన్ కుమార్ రెడ్డి, సీఈఓ స్నేహ రెడ్డి










**అనంతపురం ప్రతినిధి, జూలై 19,(రిపబ్లిక్ న్యూస్):**
నగరంలో ఇండస్ ఆసుపత్రిని ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా అత్యాధునిక ఆర్థోపెడిక్ వైద్య సేవలు అందిస్తా మని ఇండస్ ఆసుపత్రి యాజమాన్యం డాక్టర్ మదన్ కుమార్ రెడ్డి, సీఈఓ స్నేహ రెడ్డి పేర్కొన్నారు. అయితేఅనంతపురం జిల్లా ప్రజలు ఆర్థోపెడిక్ సమస్యల చికిత్స కోసం ఇకపై బెంగుళూరు, హైదరాబాద్ వంటి మహానగరాలకు వెళ్లాల్సిన అవసరం లేదన్నారు.

నగరంలోని బళ్లారి బైపాస్ రోడ్డులో అత్యాధునిక సౌకర్యాలతో ఏర్పాటు చేసిన ఇండస్ ఆసుపత్రిని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి గౌరవ అతిథులుగా వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్, హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి, అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీతమ్మ, రాయదుర్గం ఎమ్మెల్యే కాలువ శ్రీనివాసులు, కళ్యాణదుర్గం ఎమ్మెల్యే ఎమ్మెల్యే సురేంద్రబాబు, ఇండస్ ఆసుపత్రి చైర్మన్ ఎద్దుల శివారెడ్డి కుటుంబ సభ్యులు, మిత్రులు, శ్రేయోభిలాషులు తదితరులు హాజరయ్యారు. ప్రారంభోత్సవం అనంతరం ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన వైద్య సదుపాయాలను అతిథులు పరిశీలించారు. ఆధునిక సాంకేతిక పరికరాలు, అత్యాధునిక ఆపరేషన్ థియేటర్లు, రోగులకు అందుబాటులో ఉంచిన వైద్య సేవలను వారు అభినందించారు.

### అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ఆర్థోపెడిక్ సేవలు

ఈ సందర్భంగా ఆర్థోపెడిక్ నిపుణుడు డాక్టర్ మదన్ కుమార్ రెడ్డి, సీఈఓ స్నేహ రెడ్డి మాట్లాడుతూ నగర ప్రజలతో పాటు గ్రామీణ ప్రాంతాల ప్రజలు కూడా మెరుగైన వైద్య సేవల కోసం మహా నగరాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా అత్యాధునిక ఆర్థోపెడిక్ వైద్య సేవలను అందిస్తున్నట్లు వారు తెలిపారు. అందులో భాగంగా అధిక ఖర్చుతో పాటు సుదూర ప్రాంతాలకు వెళ్లి రావాలంటేనే సమయం వెచ్చించాల్సి వస్తోందని తెలిపారు. ఆ ఇబ్బందులు అన్నింటిని దృష్టిలో ఉంచుకొని అనంతపురంలోనే అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ఆర్థోపెడిక్ సూపర్ స్పెషాలిటీ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చామని చెప్పారు.చిన్నపాటి ఎముక విరుగుడు చికిత్సల నుంచి క్లిష్టమైన ట్రామా కేసులు, కీళ్ల మార్పిడి శస్త్రచికిత్సలు, మోకాలి మార్పిడి, తుంటి కీళ్ల మార్పిడి, వెన్నెముకకు సంబంధించిన పలు రకాల చికిత్సలు, ప్రమాదాల్లో గాయపడిన వారికి అత్యవసర ట్రామా కేర్ సేవలు అందిస్తున్నామని వివరించారు.

### నాణ్యమైన వైద్య సేవలు ప్రజలకు అందించడమే లక్ష్యం

ప్రతి రోగికి వ్యాధి తీవ్రతను బట్టి వైద్య చికిత్స అందించే విధంగా ఆస్పత్రిని రూపొందించామని తెలిపారు. అత్యాధునిక డిజిటల్ నిర్ధారణ పరికరాలు, సాంకేతిక ప్రమాణాలకు అనుగుణంగా రూపొందించిన ఆపరేషన్ థియేటర్లు, అనుభవజ్ఞులైన వైద్యులు, శిక్షణ పొందిన నర్సింగ్ సిబ్బంది, ఫిజియోథెరపీ సేవలు అందుబాటులో ఉనట్లు చెప్పారు.అత్యవసర పరిస్థితుల్లో వెంటనే చికిత్స అందించేలా ప్రత్యేక వైద్య బృందం సిద్ధంగా ఉంటుందని తెలిపారు. నాణ్యమైన వైద్య సేవలను సాధారణ ప్రజలకు అందించడమే తమ ప్రధాన లక్ష్యమని ఆస్పత్రి యాజమాన్యం పేర్కొంది. జిల్లాతో పాటు ఉమ్మడి అనంతపురం, సరిహద్దు ప్రాంతాల ప్రజలు కూడా ఈ సేవలను వినియోగించుకోవచ్చని వెల్లడించారు. రోగులు ఇతర నగరాలకు వెళ్లి ఇబ్బందులు పడకుండా, వారి కుటుంబ సభ్యులకు సమయం, ప్రయాణ ఖర్చు తగ్గేలా అన్ని రకాల సౌకర్యాలను కల్పించామని తెలిపారు.
కార్యక్రమంలో పలువురు వైద్యులు, వివిధ రంగాల ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, వ్యాపారవేత్తలు, సామాజిక సంస్థల ప్రతినిధులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.









# తల్లికి వందనం పేరుతో నకిలీ లింకులపై అప్రమత్తంగా ఉండాలి

**: ఎస్పీ విక్రాంత్ పాటిల్**

**అనుమానాస్పద లింకులను క్లిక్ చేయవద్దు**

**వ్యక్తిగత, బ్యాంకు వివరాలు పంచుకోవద్దు**

**సైబర్ మోసాలపై తల్లిదండ్రులకు హెచ్చరిక**



**కర్నూలు క్రైమ్ ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూలై 19)**
రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'తల్లికి వందనం' పథకం పేరుతో సైబర్ నేరగాళ్లు విద్యార్థుల తల్లిదండ్రులను లక్ష్యంగా చేసుకుని నకిలీ లింకులు పంపే అవకాశం ఉందని కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ హెచ్చరించారు. ఈ మేరకు విడుదల చేసిన ప్రకటనలో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.పథకానికి సంబంధించిన దరఖాస్తులు, అర్హతలు, నగదు జమ వంటి అంశాల పేరుతో వాట్సాప్, ఎస్ఎంఎస్ లేదా సోషల్ మీడియా ద్వారా వచ్చే అనుమానాస్పద లింకులను ఎట్టి పరిస్థితుల్లోనూ క్లిక్ చేయవద్దని ఎస్పీ తెలిపారు. అలాంటి లింకుల ద్వారా బ్యాంకు ఖాతా వివరాలు, ఆధార్ నంబర్లు, ఓటీపీలు, పాస్‌వర్డ్లు వంటి వ్యక్తిగత సమాచారాన్ని సేకరించి సైబర్ మోసాలకు పాల్పడే ప్రమాదం ఉందన్నారు.
ప్రభుత్వ పథకాలకు సంబంధించిన సమాచారాన్ని తెలుసుకోవడానికి అధికారిక ప్రభుత్వ వేదికలు, స్వర్ణ గ్రామ/స్వర్ణ వార్డు కార్యాలయాలు లేదా సంబంధిత అధికారులను మాత్రమే సంప్రదించాలని సూచించారు. అధికారిక ప్రభుత్వ సమాచారాన్ని మాత్రమే విశ్వసించాలని, తెలియని వ్యక్తులు పంపిన సందేశాలు, లింకులను నమ్మవద్దని స్పష్టం చేశారు.
వ్యక్తిగత వివరాలు, బ్యాంకు ఖాతా సమాచారం, ఏటీఎం వివరాలు, ఓటీపీలు, పాస్‌వర్డ్లు వంటి సమాచారాన్ని ఎవరికీ పంచుకోవద్దని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. సైబర్ మోసాలకు గురైన వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు కాల్ చేయాలని లేదా సైబర్ క్రైమ్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని, లేకపోతే సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ సూచించారు.

# గోల్డ్ అప్రైజర్స్ ప్రాంతీయ మహాసభలు

**నూతన ప్రాంతీయ కమిటీ ఏర్పాటు**

**సమస్యల పరిష్కారానికి జాతీయ స్థాయిలో పోరాటం చేస్తాం**

**జనరల్ సెక్రెటరీ ఈదరాడ శ్రీనివాస్, జనరల్ మేనేజర్ ఐ.శ్రీనివాసులు**



**అనంతపురం సంక్షేమం, జులై 19,(రిపబ్లిక్ న్యూస్):**
నగరంలో కెనరా బ్యాంక్ గోల్డ్ అప్రైజర్స్ ప్రాంతీయ మహాసభలను ఘనంగా నిర్వహించారు. ఆదివారం నూతన ప్రాంతీయ కమిటీని ఏర్పాటు చేసినట్లు జనరల్ సెక్రెటరీ ఈదరాడ శ్రీనివాస్, జనరల్ మేనేజర్ ఐ.శ్రీనివాసులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా జాతీయస్థాయిలో సమస్యల పరిష్కారానికి పోరాటాలు చేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జాతీయ, రాష్ట్ర కెనరా బ్యాంక్ అప్రైజర్స్ యూనియన్ జనరల్ సెక్రెటరీ ఈదరాడ శ్రీనివాస్ , కెనరా బ్యాంక్ రీజినల్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఐ.శ్రీనివాసులు, కెనరా బ్యాంక్ ఎంప్లాయిస్ యూనియన్ జనరల్ సెక్రెటరీ సంజయ్ రామ్ , రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ కుర్లపల్లి రంగాచారి, రాష్ట్ర గోల్డ్ అప్రైజర్స్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ వైయస్ ప్రకాష్ ఆచారి తదితరులు హాజరయ్యారు.

**బలమైన సంఘాన్ని నిర్మించడం ప్రధాన లక్ష్యం**

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 13 జిల్లాలో పనిచేస్తున్న గోల్డ్ అప్రైజర్స్ అందరిని ఒకే వేదికపైకి తీసుకువచ్చి సంఘటితం చేయడం,వారి హక్కుల పరిరక్షణకు బలమైన సంఘాన్ని నిర్మించడం ఈ సమావేశం ప్రధాన లక్ష్యమని నాయకులు తెలిపారు. అందరినీ ఒకే తాటిపైకి తీసుకువచ్చి సంఘాన్ని మరింత బలోపేతం చేస్తున్నామని,
తెలియజేశారు. అందులో భాగంగానే నగరంలో కెనరా బ్యాంక్ ప్రాంతీయ నూతన కమిటీని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.గోల్డ్ అప్రైజర్స్ ఎదుర్కొంటున్న సమస్యలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. ముఖ్యంగా ఇటీవల అమలులోకి తీసుకొచ్చిన బదిలీల విధానం, సెకండ్ గోల్డ్ అప్రైజర్స్ వ్యవస్థ కారణంగా



ఎదురవుతున్న ఇబ్బందులపై ప్రత్యేకంగా చర్చించి, వాటి పరిష్కారానికి సంఘం తరఫున తీర్మానాలు చేసినట్లు తెలిపారు.ఈ సమస్యలను జాతీయ స్థాయిలో ప్రధాన కార్యాలయ అధికారుల దృష్టికి తీసుకెళ్లి తగిన పరిష్కారం సాధించేందుకు కృషి చేస్తామని ఈదరాడ శ్రీనివాస్ స్పష్టం చేశారు.నూతన ప్రాంతీయ కమిటీ ఏర్పాటుతో సంఘం మరింత బలోపేతం అవుతుందని పేర్కొన్నారు.

**పేద విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగులు పంపిణీ**

ఈ సందర్భంగా వై.ఎస్. ప్రకాష్ ఆచారి మాట్లాడుతూ రాష్ట్రంలోని గోల్డ్ అప్రైజర్స్ ఒకే తాటిపైకి తీసుకువచ్చారన్నారు. ఈ సందర్భంగా సంఘ అభివృద్ధికి కృషి చేసిన జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర కమిటీ సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలోకెనరా బ్యాంక్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఎం.రమేష్ బాబు , టి.నరేంద్ర , పి. ప్రభాకర్, జిల్లా కెమెరా అప్రైజర్ సంఘ నాయకులు రామాంజనేయ చారి , ప్రవీణ్ , నాగార్జున, ఆల్ బ్యాంక్ గోల్డ్ అప్రైజర్స్ యూనియన్ జి.బాబ్జి, చంద్రశేఖర్ గుప్త , రాష్ట్ర కమిటీ సభ్యులు బుద్ధోజి ప్రసాద్, అనంతపురం జిల్లా రీజినల్ కెనరా బ్యాంక్ గోల్డప్రైజర్స్ అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గోల్డప్రైజర్స్ యూనియన్ నాయకులు పేద విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగులు పంపిణీ చేశారు.

# 22న ఎంజేపీ గురుకులంలో ఇంటర్ తరగతుల ప్రారంభం

## విద్యార్థినులకు నాణ్యమైన వసతులు కల్పించాలి -మంత్రి సవిత, ఎమ్మెల్యే పరిటాల సునీత

**అనంతపురం /రామగిరి, జూలై 19,(రిపబ్లిక్ న్యూస్):**
అనంతపురం జిల్లా రామగిరి మండలం నసనకోటలోని మహాత్మా జ్యోతిబా పూలే (ఎంజేపీ) గురుకుల బాలికల పాఠశాలలో ఈ నెల 22 నుంచి ఇంటర్మీడియట్ తరగతులు ప్రారంభం కానున్నాయి. ఇటీవల ప్రభుత్వం ఇంటర్మీడియట్ కళాశాల ఏర్పాటుకు అనుమతి ఇవ్వడంతో ప్రవేశాల ప్రక్రియ దాదాపు పూర్తయింది. బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత సంయుక్తంగా ఇంటర్మీడియట్ తరగతులను ప్రారంభించనున్నారు.
ఈ నేపథ్యంలో ఆదివారం ఎమ్మెల్యే పరిటాల సునీత గురుకుల పాఠశాలను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. తరగతి గదులు, హాస్టల్, వంటశాల, భోజనశాల, స్టోర్‌రూమ్‌తో పాటు ఇతర విభాగాలను పరిశీలించి అధికారులకు, ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. విద్యార్థినులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని మౌలిక వసతులు సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే పరిటాల సునీత మాట్లాడుతూ రాప్తాడు నియోజకవర్గంలో బాలికలకు ఇంటర్మీడియట్ స్థాయిలో




రెసిడెన్షియల్ విద్య అందించాలన్న డిమాండ్ ఎన్నో ఏళ్లుగా ఉందన్నారు. కూటమి ప్రభుత్వం ఆ అవసరాన్ని గుర్తించి నసనకోట ఎంజేపీ గురుకులంలో ఇంటర్మీడియట్ తరగతులకు అనుమతి ఇవ్వడం సంతోషకరమని చెప్పారు. ఈ నెల 22న తరగతులు ప్రారంభం కావడం ద్వారా ఆ ప్రాంత విద్యార్థినుల కల నెరవేరుతుందన్నారు. పాఠశాల వంటశాలను సందర్శించిన ఎమ్మెల్యే విద్యార్థినులకు సిద్ధం చేసిన భోజనం, కూరల నాణ్యతను పరిశీలించారు. పరిశుభ్రత ప్రమాణాలు పాటిస్తున్న తీరును గమనించి, వాటిని నిరంతరం కొనసాగించాలని సూచించారు. స్టోర్‌రూమ్‌లో నిల్వ ఉంచిన కూరగాయలు, కిరాణా సరుకులు, వాటి గడువు తేదీలను స్వయంగా పరిశీలించారు. పిల్లల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని తాజా ఆకుకూరలు, నాణ్యమైన కూరగాయలు మాత్రమే వినియోగించాలని, గడువు ముగిసిన కిరాణా సరుకులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపయోగించవద్దని సిబ్బందికి స్పష్టం చేశారు.
విద్యార్థినులకు నాణ్యమైన విద్యతో పాటు సురక్షితమైన వసతి, పోషకాహారం, పరిశుభ్రమైన వాతావరణం కల్పించడమే ప్రభుత్వ






లక్ష్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. గురుకుల విద్యాసంస్థలు రాష్ట్రంలో ఆదర్శంగా నిలిచేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, విద్యార్థుల భవిష్యత్తుకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తామని ఆమె తెలిపారు. 22న జరిగే ప్రారంభోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No.:2023/87888



# అపరిష్కృత సమస్యల పరిష్కారానికి సామరస్యమే మార్గం

## : కమిషనర్ చల్లా ఓబులేసు -గీతా ముఖర్జీ నగర్‌లో రహదారి సమస్య పరిశీలన

### అనురాగ్ ఎస్టేట్‌లో పార్కు, రోడ్డు అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశం

**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూలై 19)**

ప్రజా ప్రయోజనాల కోసం అందరూ కలిసి పనిచేయాలని, ప్రాంతీయ సమస్యలను సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు సూచించారు. గీతా ముఖర్జీ నగర్ రోడ్ నెం.5లో పలువురు సంవత్సరాలుగా అపరిష్కృతంగా ఉన్న రహదారి సమస్యను ఆయన స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్ విభాగాల అధికారులు సమన్వయంతో బాధితులతో చర్చించి రహదారి నిర్మాణ పనులను చేపట్టాలని ఆదేశించారు. అనంతరం అనురాగ్ ఎస్టేట్‌లోని పార్కు స్థలం, రహదారిని పరిశీలించిన కమిషనర్, పార్కుకు కాంపౌండ్ వాల్, నడకబాట, విద్యుత్ దీపాలు, బెంచీల ఏర్పాటుకు ప్రతిపాదనలు రూపొందించాలని సూచించారు. అలాగే రహదారి



నిర్మాణానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, నగరంలో మౌలిక వసతుల అభివృద్ధికే తొలి ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. అందుబాటులో ఉన్న నిధులను బట్టి ప్రాధాన్యత క్రమంలో సమస్యలను



పరిష్కరిస్తూ ముందుకు సాగుతున్నామన్నారు. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను కూడా సామరస్యపూర్వకంగా పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

ఈ పరిశీలనలో డీఈఈ శ్రీనివాసన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవి తదితర అధికారులు పాల్గొన్నారు.

# భక్తులతో కిటకిటలాడిన బోయకొండ గంగమ్మ ఆలయం

**చౌడేపల్లి ప్రతినిధి జూలై 19 రిపబ్లిక్ న్యూస్**



ఆషాడ మాసంలో మొదటి ఆదివారం కావడంతో బోయకొండ శక్తి క్షేత్రంలో భక్తులు పోటెత్తారు. రాష్ట్రం తో పాటు కర్ణాటక, తమిళనాడు నుంచి ఉదయాన్నే అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారి దర్శనార్థం కోసం క్యూ లైన్లలో వేచి ఉన్నారు. గంగాపురం నుంచి అమ్మవారి సన్నిధానం వరకు ఎక్కడ చూసినా భక్త జన సందోహం కనిపించింది రణభేరి గంగమ్మ ఆలయం నుంచి అమ్మవారి పుష్కరిణి వరకు ఎక్కడపడితే అక్కడ వాహనాలు ఆగిపోవడంతో ట్రాఫిక్కు తీవ్ర అంతరాయం వాటిలింది. క్యూలైన్లు సన్నిధానం పెద్ద భోగం, చిన్న భోగం కార్యాలయ సముదాయం వంటి ప్రాంతాలలో ఈవో ఉప కమిషనర్ ఏకాంబరం పర్యవేక్షించారు. భక్తులకు ఎటువంటి ఆటంకం కలగకుండా తగు చర్యలు తీసుకున్నారు క్యూ లైన్ లలో పలు చోట్ల ప్రక్షాళన చేయడం వల్ల సాధారణ భక్తులకు అమ్మవారి దర్శన భాగ్యం సులభంగా జరిగింది. ఆలయ పరిసర ప్రాంతాలు వాహన రాకపోకలు అంతరాయం వాటిల్లకుండా ఎస్సై చిన్న రెడ్డప్ప బందోబస్తు చర్యలు తీసుకున్నారు. మదనపల్లి నుంచి పలువురు చిన్నారులు తరలివచ్చి అమ్మవారి ఆలయంలో కోలాటలు వేశారు. ఈ కార్యక్రమం యాత్రికులను అలరించింది ఆలయ, అధికార, అర్చక సిబ్బంది, భక్తులకు సేవలు అందించారు

# జగన్ తుగ్లక్ మామయ్య

**ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్**

**ఎస్సీ హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరిస్తాం**

**విద్యార్థులకు కిట్లను అందజేసిన దగ్గుపాటి**

**అనంతపురం సంక్షేమం, జూలై 19,(రిపబ్లిక్ న్యూస్):**

పిచ్చి తుగ్లక్ విధానాలతో విద్యార్థి లోకంలో జగన్ తుగ్లక్ మామయ్యగా ముద్ర వేసుకున్నారని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ విమర్శలు చేశారు. నగరంలోని ఆర్.అండ్.బి అతిథి గృహం సమీపంలోని ఎస్సీ బాలుర వసతి గృహంలో ఎస్సీ,బిసి హాస్టల్ విదార్థిని, విద్యార్థులతో మమేకమవుతూ గడిపారు. విద్యార్థులకు ప్రభుత్వం నుంచి వచ్చిన సామాగ్రిని ఆయన అందజేశారు. ఇందులో స్కూల్ యూనిఫామ్, నైట్ డ్రెస్, స్పోర్ట్స్ షూ, ట్రంకు పెట్టెలు, భోజనం ప్లేట్లు వంటివి ఉన్నాయి. ముందుగా వసతి గృహానికి వచ్చిన ఎమ్మెల్యే దగ్గుపాటికి విద్యార్థులు, వార్డెన్లు, ఉపాధ్యాయులు ఘన స్వాగతం పలికారు. అనంతరం వసతి గృహాన్ని మొత్తం ఆయన పరిశీలించారు. విద్యార్థులతో మమేకమవుతూ వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారితోనే భోజనం చేశారు. ప్రభుత్వం నుంచి వచ్చిన కిట్లను ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అందజేశారు.

**గతంలో దొడ్డు బియ్యం ఉంటే ఇప్పుడు సన్న బియ్యంతో భోజనం**

ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి మాట్లాడుతూ జగన్ రెడ్డి పాలనలో విద్యా వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యమైందన్నారు. ప్రభుత్వ పాఠశాలలు మూతపడే పరిస్థితి వచ్చిందన్నారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో అనేక మార్పులు తీసుకొచ్చారన్నారు. దాని ఫలితంగా ఇప్పుడు ప్రభుత్వ పాఠశాలల్లో చేరేందుకు పోటీ ఏర్పడిందన్నారు. విద్యార్థులకు అందించే పుస్తకాలు,



బ్యాగులు, చివరకు బెల్టుల మీద కూడా జగన్ రెడ్డి ఫోటోలు వేయించుకొని పిచ్చి తుగ్లక్ తరహాలో వ్యవహ రించారన్నారు. దాని ఫలితంగా విద్యార్థులు ఆయన్ని తుగ్లక్ మామయ్య అని పిలుస్తున్నారన్నారు. పాఠశాలల్లో రాజకీయాలు ఉండకూడదన్న ఉద్దేశంతో మంత్రి నారా లోకేష్ ఇప్పుడు సర్వేపల్లి రాధాకృష్ణ వంటి మహనీయుల ఫోటోలుతో విద్యార్థులకు కిట్లు అందజేస్తున్నారన్నారు. గత ప్రభుత్వంలో ప్రభుత్వ ధనాన్ని దుబారా చేస్తూ కిట్లు కొనుగోలు చేశారని విమర్శలు చేశారు. వీటిని 10 శాతానికి పైగా తగ్గించిన ఘనత మంత్రి నారా లోకేష్ కే దక్కుతుందన్నారు. ఇంటర్మీడియట్ కళాశాలల్లో సైతం మధ్యాహ్నం భోజనాన్ని ప్రవేశపెట్టారన్నారు. గతంలో ప్రభుత్వ విద్యాసంస్థల్లో దొడ్డు బియ్యం ఉంటే ఇప్పుడు సన్న బియ్యంతో భోజనం అందజేస్తున్నారన్నారు.

**విద్యాశాఖలో ఆయన తెచ్చిన మార్పులు ఆదర్శం**

అంతేకాకుండా గత ఏడాది 63 లక్షల మంది విద్యార్థులకు తల్లికి వందనం కింద పదివేల కోట్ల రూపాయలు అందజేస్తే ఈ ఏడాది 64 లక్షల మందికి పదివేల కోట్లకు పైగా తల్లికి వందనం నిధులు ఈనెల 22వ తేదీన విడుదల చేయనున్నారని చెప్పారు. విద్యాశాఖలో ఆయన తెచ్చిన మార్పులు దేశంలోని ఆదర్శంగా నిలుస్తున్నాయని దగ్గుపాటి అన్నారు. అనంతపురం నగరంలో ఎన్నో ఏళ్లుగా పెండింగ్ లో





ఉన్న పాఠశాలలను ఉన్నత పాఠశాలగా అప్ గ్రేడ్ చేసినట్లు తెలిపారు. దీనివలన 90 మంది ఉపాధ్యాయులు అదనంగా అనంతపురం నగరానికి వచ్చారని తెలిపారు. విద్యావ్యవస్థలో రానున్న రోజుల్లో మరిన్ని మార్పులు చూస్తారని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. ఈ కార్యక్రమంలో టెలిఫోన్ భవన్ సాయిబాబా దేవాలయ అధ్యక్షుడు వైకుంఠం జయచంద్ర చౌదరి, టిడిపి నగర అధ్యక్షుడు సుధాకర్ యాదవ్, టిడిపి నగర ప్రధాన కార్యదర్శి ఫిరోజ్ అహ్మద్, మాజీ రాష్ట్ర కార్యదర్శి బుగ్గయ్య చౌదరి, క్లస్టర్ ఇంచార్జ్ లు పొట్లూరి కేశవ నాయుడు, సాకే లక్ష్మీనరసింహ, రజక కార్పొరేషన్ డైరెక్టర్ పరమేశ్వర్, టిడిపి జిల్లా మీడియా కోఆర్డినేటర్ దబ్బర కుమారస్వామి నాయుడు, టిడిపి నాయకులు సింగవరం రవి, వెంకట సుబ్బన్న, హాస్టల్ వార్డెన్ నాగర్జున, హాస్టల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వసతి గృహ విద్యార్థులకు దుస్తులు పంపిణీ



**చౌడేపల్లి ప్రతినిధి జూలై 19 రిపబ్లిక్ న్యూస్** మండల కేంద్రమైన చౌడేపల్లి లో గల ఎస్సీ బాలికలు,బాలుర వసతి గృహ విద్యార్థులకు సాంఘిక సంక్షేమ శాఖ నుంచి దుస్తులు బెడ్డింగ్ వస్తువులు వంటివి అందించారు.ఆదివారం స్థానిక ఉన్నత పాఠశాలలో సింగిల్ విండో చైర్మన్ హరి రాయల్, తెలుగుదేశం పార్టీ నాయకులు సాగర్ పంపిణీ చేపట్టారు. వసతి గృహాలలోని విద్యార్థిని విద్యార్థులకు ప్రభుత్వం ఉన్నత ఆశయంతో దుస్తులు క్రీడా బూట్లు బ్లాంకెట్ వంటి వస్తువులను అందించాలన్నారు వసతి గృహాలలో వసతులను సద్వినియోగం చేసుకొని విద్యార్థులు విద్యలో రాణించాలని ఈ సందర్భంగా వక్తలు కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ బాలురు బాలికల వసతి గృహాల వార్డన్లు సురేష్, దీపారాణి విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# తల్లికి వందనం పేరుతో నకిలీ లింకులు..

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: సీఐ వేణుగోపాల్"

**ప్రభుత్వ పథకాల పేరుతో సైబర్ నేరగాళ్ల మోసాలు..**

**అనుమానాస్పద లింకులను క్లిక్ చేయొద్దని హెచ్చరిక**

**దేవనకొండ, జూలై 19( ప్రజా రిపబ్లిక్ న్యూస్):-**




రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'తల్లికి వందనం' పథకం పేరుతో సైబర్ నేరగాళ్లు నకిలీ లింకులు పంపి ప్రజలను మోసం చేసే అవకాశం ఉందని దేవనకొండ మండల సీఐ వేణుగోపాల్ హెచ్చరించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి ఎలాంటి అనుమానాస్పద సందేశాలను నమ్మవద్దని సూచించారు.వాట్సాప్, ఎస్ఎంఎస్, టెలిగ్రామ్, ఫేస్‌బుక్ తదితర సోషల్ మీడియా వేదికల ద్వారా ప్రభుత్వ పథకాల పేరుతో వచ్చే నకిలీ లింకులను క్లిక్ చేయకూడదన్నారు. అలాంటి లింకులను తెరిస్తే వ్యక్తిగత వివరాలు, బ్యాంకు ఖాతా సమాచారం సైబర్ నేరగాళ్ల చేతికి చేరే ప్రమాదం ఉందని తెలిపారు.

ప్రభుత్వం పేరుతో డబ్బులు వస్తాయని, నమోదు చేసుకోవాలని, లబ్ధిదారుల వివరాలు అప్‌డేట్ చేయాలని వచ్చే సందేశాలను పూర్తిగా నిర్ధారించుకున్న తర్వాతే స్పందించాలని సూచించారు. ముఖ్యంగా బ్యాంకు ఖాతా నంబర్లు, ఏటీఎం కార్డు వివరాలు, ఆధార్ సంఖ్య, ఓటీపీ, యూపీఐ పిన్, పాస్‌వర్డ్ వంటి గోప్యమైన సమాచారాన్ని ఎవరికీ చెప్పకూడదన్నారు.ఏదైనా అనుమానాస్పద లింకు లేదా కాల్ వచ్చిన వెంటనే దానిని విస్మరించి, సంబంధిత అధికారులను లేదా పోలీసులను సంప్రదించాలని తెలిపారు. సైబర్ నేరాల వల్ల ఆర్థికంగా నష్టపోయినట్లయితే వెంటనే ఫిర్యాదు చేయాలని సూచించారు.సైబర్ నేరగాళ్లు ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని ప్రభుత్వ సంక్షేమ పథకాల పేరుతో మోసాలకు పాల్పడుతున్నారని, అందువల్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండటం అత్యంత అవసరమని సీఐ వేణుగోపాల్ పేర్కొన్నారు.ప్రభుత్వ పథకాలపై అధికారిక సమాచారం సంబంధిత ప్రభుత్వ శాఖలు విడుదల చేసే ప్రకటనల ద్వారానే నమ్మాలని, సోషల్ మీడియాలో వైరల్ అయ్యే ప్రతి సందేశాన్ని విశ్వసించవద్దని సూచించారు.ప్రజల అప్రమత్తతే సైబర్ మోసాలను అరికట్టే ప్రధాన ఆయుధమని పేర్కొంటూ, ప్రతి కుటుంబం సైబర్ భద్రతపై అవగాహన పెంచుకోవాలని సీఐ వేణుగోపాల్ పిలుపునిచ్చారు. ప్రభుత్వం పేరుతో వచ్చే ప్రతి లింకును జాగ్రత్తగా పరిశీలించి, అనుమానం ఉంటే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

# సేవే లక్ష్యంగా ముందుకు సాగుతున్న వైసీపీ నాయకుడు వైసీఎన్ ఎర్రగోటి అంజి

## దేవనకొండ మండలంలో పలు సేవా కార్యక్రమాలతో ప్రజల మన్ననలు

### పేదలకు అండగా.. ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతర కృషి

**దేవనకొండ, జూలై 19( ప్రజా రిపబ్లిక్ న్యూస్):-**

దేవనకొండ మండలంలో వైసీపీ నాయకుడు ఎర్రగోటి అంజి ప్రజా సేవలో తనదైన ముద్ర వేస్తున్నారు. రాజకీయాలకు అతీతంగా ప్రజలకు అవసరమైన సమయంలో అండగా నిలుస్తూ పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ స్థానికుల ప్రశంసలు అందుకుంటున్నారు.గ్రామాల్లో నెలకొన్న సమస్యలను నేరుగా పరిశీలించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడం, వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేయడం ఆయన ప్రత్యేకతగా నిలుస్తోంది. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను ఓపికగా విని పరిష్కార మార్గాలను సూచిస్తున్నారు.పేద కుటుంబాలకు ఆర్థిక సహాయం, అనారోగ్యంతో బాధపడుతున్న వారికి వైద్య సహకారం, విద్యార్థులకు విద్యా ప్రోత్సాహం, వృద్ధులకు అవసరమైన సహాయం అందిస్తూ సామాజిక బాధ్యతను చాటుతున్నారు.అంతేకాకుండా గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు, మొక్కల నాటకం, రక్తదాన శిబిరాలు, తాగునీటి సమస్యల పరిష్కారం వంటి పలు సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నారు. ప్రభుత్వ సంక్షేమ




పథకాలు ప్రతి అర్హులైన లబ్ధిదారునికి చేరేలా అవగాహన కల్పిస్తూ, దరఖాస్తుల ప్రక్రియలో కూడా సహకారం అందిస్తున్నారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు సులభంగా అందేలా కృషి చేస్తున్నారు.ఏ సమయంలోనైనా ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి కష్టసుఖాల్లో భాగస్వామిగా నిలవడం వల్ల ఎర్రగోటి అంజిపై ప్రజల్లో విశ్వాసం పెరుగుతోందని స్థానికులు పేర్కొంటున్నారు.

మండల అభివృద్ధికి అవసరమైన రహదారులు, తాగునీటి సౌకర్యాలు, విద్యుత్, విద్య, వైద్యం వంటి మౌలిక సదుపాయాల మెరుగుదల కోసం సంబంధిత అధికారులతో నిరంతరం సమన్వయం చేస్తున్నట్లు తెలుస్తోంది. యువతను సేవా కార్యక్రమాల్లో భాగస్వాములను చేస్తూ సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలను చేపట్టడం ఆయన మరో ప్రత్యేకతగా నిలుస్తోంది. సామాజిక బాధ్యతతో ముందుకు వస్తున్న యువతకు ప్రోత్సాహం అందిస్తున్నారు .ప్రజా సమస్యల పరిష్కారమే తన లక్ష్యమని, ప్రజల ఆశీర్వాదమే తనకు బలమని ఎర్రగోటి అంజి పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించి ప్రజలకు మరింత చేరువవుతానని ఆయన తెలిపారు. దేవనకొండ మండలంలో సేవా దృక్పథంతో ముందుకు సాగుతున్న ఎర్రగోటి అంజి చేపడుతున్న కార్యక్రమాలు ప్రజల్లో చర్చనీయాంశంగా మారాయి. ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాల ద్వారా సమాజాభివృద్ధికి కృషి చేస్తున్న ఆయన సేవలను పలువురు అభినందిస్తున్నారు.



# ఆషాఢ బోనాల సందర్భంగా బోనమెత్తిన 11వ వార్డు కౌన్సిలర్

**అందోల్ జులై 19 ( ప్రజా రిపబ్లిక్ న్యూస్ )**
జోగిపేట పట్టణంలో ఆషాఢ మాస బోనాల సందర్భంగా 11వ వార్డు కౌన్సిలర్ గూడెం కల్పన నాగరాజ్ బోనమెత్తి భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ గూడెం మల్లయ్య, నమస్తే ఇందూర్ పట్టణ రిపోర్టర్ మదారి నాగరాజు, కాలనీవాసులు, పెద్దలు, ఆడపడుచులు తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా ముగిసిన కట్టా పుట్టాలమ్మ జాతర, పొంగళ్లు







**రైల్వేకోడూరు జూలై 19 రిపబ్లిక్ న్యూస్.**
శ్రీకృష్ణదేవరాయలు కాలమునాటి శ్రీ కట్టా పుట్టాలమ్మ దేవాలయంలో ఆదివారం కట్టాపుట్టాలమ్మ జాతర మహోత్సవం, పొంగుబాలు కార్యక్రమం ఘనంగా నిర్వహించడం జరిగినది, కట్టా పుట్టాలమ్మ ను వివిధ రకాల పూలతో అత్యంత వైభవంగా అలంకరించిం చారు,ఓబులవారిపల్లె మండలం మంగంపేట కడప చెన్నై రహదారి పక్కన వెలసిన కట్టా పుట్టాలమ్మ దేవత అత్యంత శక్తివంతమైన దేవత అని, నీతి నిజాయితీ భక్తి శ్రద్ధలతో కొలిచిన వారికి కొంగు బంగారం గా కోర్కెలు తీర్చే తల్లి కట్టా పుట్టాలమ్మ ని స్థానికులు తెలిపారు, ప్రతి ఏడు అత్యంత వైభవంగా ఈ కార్యక్రమం జరుగుతుందని కట్టా పుట్టాలమ్మ గుడి పూజారి ఆలయ కమిటీ తెలిపారు, గుంతకల్లు డి ఆర్ యు సి సి సభ్యులు, వైఎస్ఆర్సిపి రాయలసీమ బూత్ కమిటీ అధ్యక్షుడు తల్లెం భరత కుమార్ రెడ్డి ఆదివారం కట్టాపుట్టాలమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు గుడి పూజారి ఆయనకు వేదమంత్రాలు చదివి ఆశీర్వదించితీర్థప్రసాదాలు అందించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రజలందరినీ కట్టా పుట్టాలమ్మ చల్లగా చూడాలని కోరుకుంటున్నాను అన్నారు, నియోజకవర్గం నలుమూలల నుండి భక్తులు భారీ సంఖ్యలో కట్టా పుట్టాలమ్మ జాతరలో పాల్గొని పూజలు నిర్వహించారు, కోలాటం చెక్కభజనల అక్రమాలను భక్తులు ఆనందంగా తిలకించారు, అనంతరం భక్తుల కోసం ఆలయ కమిటీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు అన్నదాన కార్యక్రమంలో భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



# విద్యార్థులకు ఉన్నత లక్ష్యాల ప్రేరణ కల్పిద్దాం

**ఆర్య ఈడిగ సంఘం అధ్యక్షుడు శేఖర్ -ప్రతిభావంతులైన ఈడిగ విద్యార్థులకు ప్రోత్సాహం**

**రూ.10 వేల విరాళం అందజేసిన ఆర్య ఈడిగ సంఘం**







**శ్రీ సత్యసాయి/హిందూపురం, జూలై 19,(రిపబ్లిక్ న్యూస్):**
విద్యార్థులకు ఉన్నత లక్ష్యాల ప్రేరణ కల్పిద్దామని ఆర్య ఈడిగ సంఘం అధ్యక్షుడు శేఖర్ అన్నారు. ఈ సందర్భంగా సత్యసాయి జిల్లా హిందూపురంలో ప్రతిభావంతులైన ఈడిగ విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఆర్య ఈడిగ సంఘం ముందుకొచ్చింది.ఆ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన పదో తరగతి, ఇంటర్మీడియట్ ప్రతిభా అవార్డుల కార్యక్రమానికి ఆర్య ఈడిగ సంఘం తరఫున రూ.10 వేల చెక్కును అందజేశారు.పట్టణంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆర్య ఈడిగ సంఘం అధ్యక్షుడు శేఖర్, ప్రధాన కార్యదర్శి వినయ్ ఆధ్వర్యంలో ఈ విరాళాన్ని అందించారు. సమాజ అభ్యున్నతికి విద్యే ప్రధాన ఆయుధమని, విద్యార్థుల్లో ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం ద్వారా మరింత మంది ఉన్నత లక్ష్యాలను సాధించేలా ప్రేరణ కల్పించవచ్చని సంఘం ప్రతినిధులు పేర్కొన్నారు.ఈ సందర్భంగా బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత, మాజీ మంత్రి కె.ఈ. ప్రభాకర్, గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి గురుమూర్తి గౌడ్, గౌడ సంఘం అధ్యక్షుడు గండ్లూరి నాగభూషణం, ఈడిగ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకల వేణుగోపాల్ విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. విద్యతోనే సమాజంలో గౌరవప్రదమైన స్థానం లభిస్తుందని, యువత ఉన్నత విద్యను అభ్యసించి అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు.ప్రతిభావంతులైన విద్యార్థులను సత్కరించడం ద్వారా వారిలో ఆత్మవిశ్వాసం పెంపొందుతుందని, ఇటువంటి కార్యక్రమాలు ఇతర విద్యార్థులకు కూడా స్ఫూర్తిగా నిలుస్తాయని నాయకులు అభిప్రాయపడ్డారు. సమాజ సేవతో పాటు విద్యా రంగానికి చేయూత అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఈడిగ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొడతల సూరిబాబు, ట్రెజరర్ తుమ్మల నారాయణస్వామి, శ్రీరాములు, ప్రసాద్, శ్రీనివాసులు, వెంకటేష్, పరకాల కృష్ణమూర్తి, సీతారామరాజు, నీళ్ల రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# కాపుబలిజలతోనే సామాజికాభివృద్ధి సాధ్యం

**గూడూరి వెంకటేశ్వర్లు**





**విశాఖపట్నం ప్రతినిధి, జూలై 19,(రిపబ్లిక్ న్యూస్):**
కాపు, బలిజ వర్గాల ఐక్యతతో పాటు వారి సామాజిక, ఆర్థిక అభివృద్ధికి కృషి చేస్తున్న నాయకుల సేవలు అభినందనీయమని అఖిల భారత బీసీ ప్రజా వెల్ఫేర్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు గూడూరి వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం విశాఖపట్నంలోని కాపు వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయాన్ని ఆయన సందర్శించి సంఘం అధ్యక్షుడు మద్దింశెట్టి సురేష్, రాష్ట్ర బలిజ కాపు నాయకుడు అరిగెల మనోహర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో వివిధ బీసీ, కాపు, బలిజ వర్గాల సంక్షేమం, సామాజిక సాధికారత, యువతకు ఉపాధి అవకాశాల కల్పన, విద్యా ప్రోత్సాహం వంటి అంశాలపై చర్చించారు. సమాజంలోని వెనుకబడిన వర్గాలు అభివృద్ధి చెందాలంటే పరస్పర సహకారం, ఐక్యత ఎంతో అవసరమని గూడూరి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. కాపు, బలిజ వర్గాల హక్కుల పరిరక్షణతో పాటు వారి ఆర్థిక పురోగతికి కాపు వెల్ఫేర్ అసోసియేషన్ చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు.ప్రస్తుత పరిస్థితుల్లో వివిధ సామాజిక వర్గాలు విభేదాలకు తావులేకుండా ఐక్యంగా ముందుకు సాగితేనే అభివృద్ధి సాధ్యమవుతుందని ఆయన అన్నారు. విద్య, ఉపాధి, స్వయం ఉపాధి రంగాల్లో యువతను ప్రోత్సహించేందుకు సామాజిక సంస్థలు మరింత చొరవ చూపాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో సేవా సంస్థలు కీలక పాత్ర పోషించాలని సూచించారు.అనంతరం కాపు వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మద్దింశెట్టి సురేష్, రాష్ట్ర బలిజ కాపు నాయకుడు అరిగెల మనోహర్ గూడూరి వెంకటేశ్వర్లును పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకుంటూ భవిష్యత్తులో సమాజ అభ్యున్నతికి కలిసి పనిచేయాలని నిర్ణయించారు.ఈ కార్యక్రమంలో విశాఖపట్నం నగర బీసీ నాయకుడు డెక్క సత్యం నాయుడు, కాపు వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, బీసీ ప్రజా వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# లైనింగ్ పనుల్లో అవినీతి అక్రమాలు

**హంద్రీనీవా పరిరక్షణకు వైసీపీ నేతల పోరుబాట**

**చోళసముద్రం వద్ద కాలువ పరిశీలన**

**సాగునీటి హక్కుల కోసం ఉద్యమం ఉధృతం చేస్తాం**

**వైసిపి జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట్రామిరెడ్డి**





**అనంతపురం సంక్షేమం, జూలై 19,(రిపబ్లిక్ న్యూస్):**
హంద్రీనీవా ప్రాజెక్టు లైనింగ్ పనుల్లో అవినీతి అక్రమాలు జరిగాయని వైసిపి జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. ఈ సందర్భంగా హంద్రీనీవా ప్రాజెక్టు పరిరక్షణతో పాటు గ్రేటర్ రాయలసీమ సాగునీటి హక్కుల సాధనే లక్ష్యంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పేర్కొన్నారు. ఆదివారం ఉరవకొండ నియోజకవర్గంలోని కూడేరు మండలం చోళసముద్రం సమీపంలోని హంద్రీనీవా ప్రధాన కాలువను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సుమారు రెండు కిలోమీటర్ల మేర రైతులు, పార్టీ శ్రేణులతో కలిసి పాదయాత్ర నిర్వహించి కాలువ లైనింగ్ పనులను పరిశీలించిన నాయకులు, ప్రాజెక్టు పనుల్లో భారీ అవకతవకలు జరిగాయని ఆరోపించారు. ఈ సందర్భంగా నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, కర్నూలు జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి, మాజీ మంత్రి శైలజానాథ్, మాజీ ఎమ్మెల్యేలు వై. విశ్వేశ్వరరెడ్డి, కేతిరెడ్డి పెద్దారెడ్డి, జిల్లా పరిషత్ చైర్పర్సన్ బోయగిరిజమ్మ, వైయస్సార్సీపీ బీసీ విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ బీసీ రమేష్ గౌడ్, మాజీ అహుడ చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్, మాజీ ఎంపీ రంగయ్య, పామిడి వీరాంజనేయులు, ఆలమూరు శ్రీనివాస్ రెడ్డి, శ్రీదేవి, వైసిపి యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సాకేత్ చంద్రశేఖర్, డిప్యూటీ మేయర్ వాసంతి, డిప్యూటీ మేయర్ కొగటం విజయ్ భాస్కర్ రెడ్డి, నదీమ్ అహ్మద్ , గ్రేటర్ రాయలసీమ ప్రాజెక్టుల సాధన టాస్క్‌ఫోర్స్ జిల్లా కోఆర్డినేటర్ నార్పల సత్యనారాయణరెడ్డి, ఎమ్మెల్సీ మంగమ్మ, జిల్లా ఉపాధ్యక్షురాలు నైరుతిరెడ్డి తదితరులు పరిశీలించారు.

**నీటి ప్రవాహం ఎందుకు పెరగలేదో సమాధానం చెప్పాలి**

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి సంకల్పంతో రాయలసీమ కరువు ప్రాంతాలకు కృష్ణా జలాలు అందించేందుకు హంద్రీనీవా ప్రాజెక్టు రూపుదిద్దుకుందని, అనంతరం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో కాలువ సామర్థ్యాన్ని 6,300 క్యూసెక్కులకు పెంచే చర్యలు చేపట్టారని పేర్కొన్నారు. అయితే ప్రస్తుత ప్రభుత్వం టెండర్లను రద్దు చేసి ప్రాజెక్టును తిరిగి 3,850 క్యూసెక్కుల సామర్థ్యానికే పరిమితం చేసిందని విమర్శించారు. రెండేళ్లలో రూ.3 వేల కోట్లకు పైగా ఖర్చు చేశామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, ఆ మేరకు పనులు జరిగి ఉంటే అనంతపురం జిల్లాకు 80 టీఎంసీల మేర నీరు అందేదని, నీటి ప్రవాహం ఎందుకు పెరగలేదో ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. హంద్రీనీవా కాలువ లైనింగ్, విస్తరణ పనులు నాసిరకంగా జరిగాయని, వాటిలో వందల కోట్ల రూపాయల అవినీతి జరిగిందని, అయితే వాటిపై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును కూడా ఉద్దేశపూర్వకంగా నిలిపివేశారన్నారు. ఈ సందర్భంగా రాయలసీమ సాగునీటి హక్కుల కోసం ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని తెలిపారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే హంద్రీనీవా సామర్థ్యాన్ని 11,500 క్యూసెక్కులకు పెంచి రాయలసీమకు పూర్తి స్థాయిలో కృష్ణా జలాలు అందిస్తామని తెలియజేశారు.





# శ్రీ కామేశ్వరీ దేవికి ఆర్యవైశ్యుల ఆషాఢ మాసం చీర, సారె

**- భక్తిశ్రద్ధలతో సమర్పించిన ఆర్య వైశ్య కుటుంబ సభ్యులు**

**మహానంది, జూలై 19, (రిపబ్లిక్ న్యూస్)**
మహానందిలో కొలువైన శ్రీ కామేశ్వరీ దేవి అమ్మవారికి ఆషాఢమాసం కావడంతో పలు ప్రాంతాలకు చెందిన ఆర్యవైశ్య కుటుంబ సభ్యులు ఆదివారం చీర, సారె అందించి సంప్రదాయంలో భాగంగా తమ భక్తిని చాటుకున్నారు. నంద్యాల పట్టణానికి చెందిన గ్రంధి వరప్రసాద్, ప్రొద్దుటూరు పట్టణంలోని మాలపాటి నాగరాజు, బద్వేలు పట్టణంలో ఉంటున్న వల్లంకొండు లక్ష్మీ నారాయణ , నంద్యాల పట్టణ వాస్తవ్యులు ఆరవేటి పరమేష్, మహానంది గ్రామానికి చెందిన భవనాశి ఎల్లయ్య, దంపతులు శ్రీ కామేశ్వరీ దేవి సహిత శ్రీ మహానందీశ్వర స్వామి దంపతులకు చీర, సారె తో పాటు పట్టు వస్త్రాలు సమర్పించారు. మహానంది ఆలయంలో కొలువైన స్వామి, అమ్మవార్లు ఎంతో మహిమాన్వితులని, వారిని నిత్యం పూజించడం ద్వారా సకల కోరికలు నెరవేరుతాయి అని వారు తెలిపారు.



# వర్షం వస్తే అవస్థలు ఇలా

**మహానంది, జూలై 19, (రిపబ్లిక్ న్యూస్)**
మహానంది మండల కేంద్రమైన వీ.తిమ్మాపురం గ్రామంలోని ప్రధాన వీధి అయిన పెద్దమ్మ అరుగు వద్ద రోడ్డుపై వర్షపు నీరు నిలవడంతో కాలనీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. శని, ఆదివారం కురిసిన కొద్దిపాటి వర్షానికి రోడ్డుపై నీరు నిలిచిపోవడంతో అవస్థలు పడుతున్నట్లు కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి ప్రధాన రోడ్డుపై వర్షపు నీరు నిలవకుండా తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



# మనిషి మనుగడ ప్రమాదంగా మారకముందే చెట్టు నాటండి

## కట్కాపూర్ సర్పంచ్ పడాల పూర్ణిమా తిరుపతి







**రాయికల్ మండలం జులై,19( రిపబ్లిక్ న్యూస్)**
జగిత్యాల జిల్లా రాయికల్ మండలం కట్కపూర్ గ్రామంలో మొక్కలు నాటి కార్యక్రమంలో భాగంగా ఈరోజు మహిళ గ్రూపు వాళ్లను పిలిచి సమావేశంలో మొక్కల పెంపు కార్యక్రమం గురించి అవగాహన కల్పించడం జరిగింది ప్రతి గ్రామంలో మొక్కలు నాటి వాటిని సంరక్షించినట్లయితే మానవ మునగడ సాధ్యమవుతుందని లేకపోతే మానవ మనుగడకే ప్రమాదం అని కట్కాపూర్ సర్పంచ్ పడాల పూర్ణిమతిరుపతి మాట్లాడడం జరిగింది ఇట్టి కార్యక్రమంలో కట్కాపూర్ కార్యదర్శి వివో సంఘాల అధ్యక్షురాలు సుజాత మరి అన్ని సంఘాల అధ్యక్షులు మహిళ గ్రూపులు ఈ కార్యక్రమంలో పాలు పంచుకోవడం జరిగింది

# రాయికల్లో వారాహి నవరాత్రి ఉత్సవాలు







**రాయికల్ మండలం జులై 19( రిపబ్లిక్ న్యూస్)**
జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణంలోని శ్రీశ్రీశ్రీ లలితాంబిక శక్తిపీఠంలోని వారాహి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆదివారం బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించగా మహిళలు బోనాలతో ఆలయానికి చేరుకొని మొక్కులు చెల్లించుకున్నారు. పట్టణంతో పాటు పరిసర గ్రామాల నుంచి భక్తులు. మాటలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి వేడుకల్లో పాల్గొన్నారు. పురోహితులు. రామకృష్ణ, జగదీశ్వర్, రాంగోపాల్, భక్తులు మరియు మాటలు, పద్మ, కవిత, పరమేశ్వరి, రాజవ్వ, లింగవ్వ, భాగ్య, సంగీత, నాగేందర్, హనుమాన్లు, సుభాష్ రాజ్, అనిల్ రెడ్డి, కృష్ణారెడ్డి, రామకృష్ణారెడ్డి, ప్రకాష్, రాజమౌళి, ఆలయ కమిటీ సభ్యులు మరియు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

# పేదవారికి ఉచిత కంటి ఆపరేషన్లు చేసిన జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్



**రాయికల్ మండలం జూలై,19 ( రిపబ్లిక్ న్యూస్)**జగిత్యాల పావని కంటి ఆసుపత్రి మరియు ఆపి,రోటరీ క్లబ్ జగిత్యాల వారి ఆధ్వర్యం లో జగిత్యాల నియోజకవర్గ మరియు పరిసర ప్రాంతాలకు చెందిన 12మంది నిరుపేదలకు ఉచిత కంటి శస్త్ర చికిత్సలు చేసి,ఉచిత మందులు,కంటి అద్దాలు పంపిణీ చేసిన జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజయ్ కుమార్ మాట్లాడుతూ మనిషికి చూపు అనేది అవసరమని దాని కొరకై ప్రతి పేదవారికి ఉచితంగా కంటి ఆపరేషన్ చేస్తా అని అన్నారు ఈ కార్యక్రమంలో రాయికల్ మండల పార్టీ అధ్యక్షుడు రవీందర్ రావు,జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షులు దుమల రాజ్ కుమార్,ఆసుపత్రి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# బహుజనుల బద్ధ శత్రువులు బిజెపి కాంగ్రెస్ బిఆర్ ఎస్ పార్టీలు

## బీఎస్పీ ఛీఫ్ జోన్ ఇంచార్జ్ అడ్వకేట్ నిషాని రామచంద్రం



**బాన్సువాడ ప్రతినిధి జులై 19 ( ప్రజా రిపబ్లిక్ న్యూస్ )**
బహుజనుల బద్ధ శత్రువు లు బిజెపి కాంగ్రెస్ బిఆర్ ఎస్ పార్టీ లు అని రానున్న ఎన్నికల్లో తెలంగాణ లో ఆ పార్టీ లని ఓడించాలని బీఎస్పీ ఛీఫ్ జోన్ ఇంచార్జ్ అడ్వకేట్ నిషాని రామచంద్రం అన్నారు. ఈ రోజు ఏర్పాటు చేసిన జహీరాబాద్ పార్లమెంట్ సమావేశం కి ఆయన ముఖ్య అతిథిగా హాజరైనారు. రోడ్డు భవనాల అథితి గృహం లో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొని ముందుగా బహుజన పితామహులైన మహాత్మా పూలే , బాబాసీహేబ్ అంబేద్కర్ మాన్యవర్ కాన్షీరామ్ ల చిత్రపటాలకు పూల మాల వేసి నివాళులు అర్పించి కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల (26న) ఇరవై ఆరు న కామారెడ్డి లో చత్రపతి సాహూజీ మహారాజ్ గారి రిజర్వేషన్ ల దివ్యనోత్సవ సభ కి వేలాది గా హాజరు కావాలని యువత కు పిలుపునిచ్చారు. దేశంలో అధికారంలో ఉన్నా బిజెపి ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం రెండూ కూడ బహుజనుల వ్యతిరేక ప్రభుత్వాలే అని విమర్శించారు. ఇవి రిజర్వేషన్ల వ్యతిరేక పార్టీలు అని అన్నారు. దేశంలో బిసిలు అన్ని రంగాలలో వెనుకబడి పోవడానికి కారణం కాంగ్రెస్ బిజెపి పార్టీ లే అని అన్నారు. నలబై మూడు ఏండ్లు బిసిలకు ఏ రంగంలో రిజర్వేషన్ లు అమలు కాక పోవడానికి కారణం కాంగ్రెస్ బిజెపి లే అని అన్నారు. బీఎస్పీ పోరాటం వలన మాన్యవర్ కాన్షీరామ్ గారి పోరాటం వలన వి పి సింగ్ ప్రభుత్వం దిగివచ్చి ఇరవై ఏడు శాతం రిజర్వేషన్ లు అమలు చేసిందని అన్నారు. బిజెపి రాజ్యాంగం రద్దు చేయాలని కుట్ర చేస్తుందని అన్నారు. బిజెపి ప్రభుత్వం మళ్లి అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని రద్దు చేస్తారని అన్నారు. రాజ్యాంగం రక్షణ కోసం ప్రజలందరు బహుజన్ సమాజ్ పార్టీ అధినాయకురాలు బెహన్ జీ కుమారి మాయావతి గారి నాయకత్వంలో తెలంగాణ లో బహుజన రాజ్యం ఏర్పాటు కోసం పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జోన్ ఇంచార్జ్ గైని గంగాధర్, పార్లమెంట్ ఇంచార్జి ఉబ్బిత్ వార్ రోహిదాస్ జిల్లా అధ్యక్షులు మాలోత్ హరిలాల్ నాయక్, కామారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి బండకాడి పర్శరాములు , సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు గొల్ల సతీష్ , ప్రధాన కార్యదర్శి అశోక్ , ఈసి మెంబర్ బస్కే క్రిష్ణ , బాన్సువాడ అసెంబ్లీ అధ్యక్షులు అక్కగారి జగన్, ఎల్లారెడ్డి అధ్యక్షులు మరియు సాయి బాబు, జుక్కల్ అసెంబ్లీ ఇన్చార్జి రాసమల్ల బాబు , అసెంబ్లీ అధ్యక్షులు బంగారి జైపాల్, రెండూ జిల్లా ల నాయకులు తదితరులు పాల్గొన్నారు

# పేదింటి బిడ్డల పెద్ద దిక్కు శాంతి ఫౌండేషన్ చైర్మన్ తెలంగాణ రాష్ట్ర బీమ్ ఆర్మీ చీఫ్ సిద్దు రావన్







**జహీరాబాద్ జులై 19(ప్రజా రిపబ్లిక్ న్యూస్ )**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గం కోహిర్ మండలం చింతల గట్టు గ్రామపంచాయతీ పరిధిలో బహుజనుల ఆశాజ్యోతి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ మొదటగా పూలమాల వేసి అంబేద్కర్ ఆశీస్సులతో దర్గాను సందర్శించి చర్చ్ కి వెళ్లి దైవానుగ్రహం పొంది పోచమ్మ తల్లిఅనుగ్రహం పొందడం జరిగింది మన ఊరు మన బిడ్డ మన స్థానికుడు మన అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా తల్లి పేరున కొడుకు నిర్మించిన ఓ అద్భుతమైన రూపకల్పననే ఈ శాంతి ఫౌండేషన్. కోల్పోయిన దాని విలువ ఎంత అనేది పోగొట్టుకున్న వాళ్లకే తెలుస్తుందని ఈ సందర్భంగా తన తల్లి శాంతమ్మ జ్ఞాపకం చేసుకున్నారు మనం ఎవరికీ ఏది ఇస్తామో తిరిగి అదే మనకు వస్తుందని కన్నతల్లి ఆశయం నెరవేర్చడంలో నిజమైన విజయం ఉందని చింతల గట్టు గ్రామపంచాయతీ దగ్గర జరిగిన సమావేశంలో శాంతి ఫౌండేషన్ చైర్మన్ తెలంగాణ రాష్ట్ర బీమ్ ఆర్మీ చీఫ్ సిద్దు రావణ్ అన్నారు. దానం చేసే చేతులే సమాజానికి నిజమైన సంపదని పేదింటి బిడ్డలకు పెద్దదిక్కుగా నిస్వార్థమైన సేవ ప్రేమికుడిగా మీ ముందుకు ఈ చిరుకానుకలు తీసుకురావడం జరిగిందని పేర్కొన్నారు ఈ సందర్భంగా శాంతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రామంలో కడు పేద కుటుంబాలకు నిత్యవసర వస్తువులు మరియు బియ్యం పంపిణీ రోజువారి అవసరాల నిమిత్తం ఆర్థిక సహాయం కూడా అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పలువురు కళాకారులు డప్పుల దరువులతో ఆటపాటలతో గ్రామంలో ఉన్న అన్ని కులాలను ఏకం చేస్తూ ఆహ్లాదకరమైన వాతావరణంలో ఈ కార్యక్రమం విజయవంతం చెయ్యడం జరిగింది ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ విద్యాసాగర్ గారు ఉప సర్పంచ్ ఖలీల్ భాషా గారు మరియు వార్డు సభ్యులు యువకులు గ్రామస్తులు మరియు బీమ్ ఆర్మీ టీం పాల్గొన్నారు ఈ సందర్భంగా శాంతి ఫౌండేషన్ చైర్మన్ తెలంగాణ రాష్ట్ర భీమ్ ఆర్మీ చీఫ్ సిద్దు



రావణ్ గారిని సర్పంచ్ మరియు వార్డు సభ్యులు ఘనంగా సన్మానించడం జరిగింది.

# 20 వ తేదీ నాటి గ్రీవెన్స్ హెల్ప్ డెస్క్ ద్వారా దరఖాస్తులు స్వీకరణ

## -జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్



**మెదక్ జిల్లా ప్రతినిధి జూలై 19 ( ప్రజా రిపబ్లిక్ న్యూస్)**
ప్రతీ సోమవారం ప్రజావాణి కార్యక్రమం జరుగుతున్న నేపథ్యంలో.....ఈ నెల 20 వ తేదీన జరిగే ప్రజావాణి కార్యక్రమం హెల్ప్ డెస్క్ ద్వారా దరఖాస్తుల స్వీకరిస్తున్నట్లు లిజిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ఆదివారం ఒక ప్రకటన లో తెలిపారు ఈ నెల 20 వ తేదీన సోమవారం ఉమ్మడి జిల్లా మంత్రివర్యుల సమావేశం సంగారెడ్డి లో ఉన్నందున. జిల్లా కలెక్టర్, తోపాటు వివిధ శాఖల అధికారులందరూ సంగారెడ్డి కలెక్టరేట్ కార్యాలయంలో సమావేశానికి హాజరు కావాల్సి ఉన్నందున . అధికారులు అందుబాటులో ఉండరు ఆరోజున జరగాలిసిన గ్రీవెన్స్ దరఖాస్తుల ని హెల్ప్ డెస్క్ ద్వారా స్వీకరిస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు

# 18 రోజుల కొడుకును కొట్టి చంపిన కేసులో తండ్రి రిమాండ్

## కన్న కొడుకుపైనే కర్కశత్వం.. తండ్రి చేతిలో పసికందు మృతి



**అందోల్ నియోజకవర్గ ప్రతినిధి జులై 19( ప్రజా రిపబ్లిక్ న్యూస్ )**
కొడుకు ఆలనా పాలనా భరించలేకపోతున్నానని, భార్యపై కోపంతో 18 రోజుల కన్న కొడుకును మంచంపై వేసి దారుణంగా కొట్టి చంపిన ఘటనలో జోగిపేట సీఐ అనిల్ కుమార్ మాట్లాడుతూ జోగిపేట ఇందిరానగర్ కాలనీలో నివాసం ఉంటున్న కృష్ణ గౌరమ్మ లు గత సంవత్సరం క్రితం ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. వీళ్లకు కుమారుడు జన్మించాడు. పుట్టిన18 రోజులకే పోషించడం నాకు కష్టంగా వుంది అలాగే నాకు వంట చేయడం లేదు అని బాబును అమ్మేస్తా అని కృష్ణ చెప్పడంతో ఇద్దరిమధ్య గొడవ మొదలైశీది. ఇద్దరి మధ్య వాగ్వాదం జరగడంతో కోపంతో కన్న కొడుకును కాళ్ళు పట్టుకొని మంచంకు వేసి కొట్టడంతో బాబు స్పృహ తప్పడంతో తల్లి పక్కింటి కవితను పిలిచి బాబును హుటాహుటిన ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లడంతో బాబు పరిస్థితి చూసి సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడంతో మార్గమధ్యంలోని చనిపోయాడు అని జోగిపేట సిఐ అనిల్ కుమార్ మరియు ఎస్సై గిరి శ్రీకాంత్ చెప్పడం జరిగింది. నిందితుడైన కృష్ణను ఈరోజు ఉదయం జోగిపేట బస్టాండ్‌లో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం అతనిపై హత్య కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

# శ్రీ కామేశ్వరి దేవికి ఆషాఢ మాసం చీరసారే







## - వందలాదిగా తరలివచ్చిన వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ సభ్యులు

**మహానంది, జూలై 19, (రిపబ్లిక్ న్యూస్)**
వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ సంఘం ఆధ్వర్యంలో మహానందిలో వెలసిన శ్రీ కామేశ్వరి అమ్మవారికి ఆషాడ మాసం కావడంతో పుట్టింటి చీర, వడిబియ్యం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆదివారం వాసవి క్లబ్ అంతర్జాతీయ అధ్యక్షుడు సిద్ధా సూర్యప్రకాశ్ ఆధ్వర్యంలో ఆ సంఘం గవర్నర్స్ డిస్ట్రిక్ట్ ఆఫీసర్స్ నాగ శైలజ, మునగనూరు శ్రీలక్ష్మితో పాటు వందలాది మంది మహిళలు భక్తిశ్రద్ధలతో పాల్గొని శ్రీ కామేశ్వరీ దేవికి ఆషాఢం సారె సమర్పించారు. మహానంది క్షేత్రానికి వచ్చిన వారికి ఆలయ ఈవో నల్లకాలువ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఏఈఓ ఎరమల మధు ఆలయ వేద పండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర్ అవధాని, హనుమంత శర్మ, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు శ్రీ కామేశ్వరీ దేవి సహిత శ్రీ మహానందీశ్వర స్వామి వారికి పట్టు వస్త్రాలు, చీర, సారే సమర్పించి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ప్రతి ఏడాది ఆషాడ మాసంలో అమ్మవారికి ఆర్యవైశ్య సంఘానికి చెందిన మహిళలు చీర, సారే సమర్పిస్తూ ఆషాడ మాస ప్రాముఖ్యతను తెలుపుతున్నారు.

# రామ్‌చరణ్-సుకుమార్ కాంబో

## ఆర్‌సీ 17 పట్టాలకెక్కనుందని ప్రచారం



ఈ ఏడాది పెద్ది సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్టందుకున్న రాంచరణ్ మరోమారు సుకుమార్‌తో సినిమాకు సిద్ధం అవుతున్నారు. వీరి కాంబో రంగస్థలం బాక్సాఫీస్‌ను షేక్ చేసిందని తెలిసిందే. ఈ ఇద్దరి క్రేజీ కాంబోలో మరోసారి ఆర్‌సీ 17సందడి చేసేందుకు రెడీ అవుతోంది. మూవీ లవర్స్‌తోపాటు అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న అప్‌డేట్ ఒకటి నెట్టింట వైరల్ అవుతోంది. తాజా టాక్ ప్రకారం ఆర్‌సీ17 మూవీ ఫైనల్ స్క్రిప్ట్ పూర్తయింది. మేకర్స్ త్వరలోనే గ్రాండ్‌గా ఈ సినిమాను షురూ చేసేందుకు ప్లాన్ చేస్తున్నారని ఫిలింనగర్ సర్కిల్ సమాచారం. అన్నీ అనుకున్నట్టు కుదిరితే వచ్చే సెప్టెంబర్‌లోనే సినిమా లాంచ్ కానుందట. అంతేకాదు నవంబర్ నుంచి రెగ్యులర్ షూటింగ్ మొదలు కానుందని ఇన్‌సైడ్ టాక్. రంగస్థలం తర్వాత సుకుమార్-రాంచరణ్ కాంబోలో వస్తున్న సినిమా కావడంతో అంచనాలు భారీగానే ఉన్నాయి. ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. నటీనటులు, ఇతర సాంకేతిక నిపుణుల వివరాలపై త్వరలోనే మేకర్స్ క్లారిటీ ఇవ్వనున్నారు. ఈ చిత్రానికి రాక్‌స్టార్ దేవీ శ్రీ ప్రసాద్ మ్యూజిక్ బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడని వార్తలు రాగా.. మరోవైపు ధురంధర్ శశ్వత్ సచ్‌దేవ్ పేరు కూడా తెరపైకి వచ్చింది. రాంచరణ్ నిర్మాతగా నిఖిల్ హీరోగా నటిస్తోన్న ఇండియా హౌస్ చిత్రానికి కూడా శశ్వత్ సచ్‌దేవ్ సంగీతం అందిస్తున్నాడు.

# ప్రియాంక చోప్రా

## వారణాసి లుక్ విడుదల



మహేశ్ బాబు కథానాయకుడిగా రాజమౌళి దర్శకత్వంలో రానున్న చిత్రం 'వారణాసి'లో మహేశ్‌కు జోడీగా బాలీవుడ్ నటి ప్రియాంక కనిపించనున్న విషయం తెలిసిందే. మందాకిని పాత్రలో ఆమె సందడి చేయనున్నారు. శనివారం ఆమె పుట్టినరోజు సందర్భంగా సినిమా సెట్‌లోని ఫొటోలను విడుదల చేస్తూ రాజమౌళి పోస్ట్ పెట్టారు. 'ఆమె నవ్వితే అందం.. నవ్వకపోతే నిప్పు కణిక' అనే క్యాప్షన్ పెట్టారు. ప్రస్తుతం ఈ ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. మహేశ్ కూడా ప్రియాంకకు విషెస్ చెప్పారు. 'మా ఒకే ఒక్క మందాకినికి హ్యాపీ బర్త్‌డే..' అని పోస్ట్ పెట్టారు. ప్రియాంక 'వారణాసి' కోసం 14 నెలల నుంచి షూటింగ్‌లో పాల్గొంటున్నారు. ఇందులో అద్భుతమైన స్లో మోషన్ జంప్స్ చేసినట్లు ఆమె చెప్పారు. ఇక ఈ చిత్రంలో రుద్ర, శ్రీరాముడిగా మహేశ్ ద్విపాత్రాభినయం చేస్తున్నారు. ప్రపంచంతో పాటు కాలాల్ని చుట్టేసే సాహసికుడి కథగా ఇది ముస్తాబవుతున్నట్లు తెలిసిందే. భారీ బడ్జెట్‌తో పాన్ ఇండియా స్థాయిలో రానున్న ఈ సినిమా వచ్చే ఏడాది ఏప్రిల్ 7న విడుదల కానుంది. ఈ ఏడాది అక్టోబర్ నాటికి చిత్రీకరణ పూర్తి చేసి ప్రచారాన్ని ప్రారంభించనున్నారు. ప్రియాంక చోప్రా ఫొటోస్ రిలీజ్ నేపథ్యంలో సోషల్ మీడియాలో మరోసారి ఆసక్తికర ప్రచారం మొదలైంది. మహేశ్ బాబు పుట్టినరోజు సందర్భంగా ఆగస్టు 9న వారణాసి తొలి గ్లింప్స్‌ను విడుదల చేయనున్నట్లు అభిమానులు, ఫ్యాన్ పేజీలు పెద్ద ఎత్తున పోస్టులు చేస్తూ హల్‌చల్ చేస్తున్నాయి. 'బాబు బర్త్‌డేకు భారీ సర్‌ప్రైజ్', 'బాబు బర్త్‌డేకు గ్లింప్స్ లోడింగ్'. 'ఆగస్టు 9న ఇంతకుముందెన్నడూ చూడని హైప్ చూడబోతున్నారు' అంటూ అభిమానులు సోషల్ మీడియా వేదికగా పోస్టులు షేర్ చేస్తున్నారు. దీంతో హ్యాష్‌ట్యాగ్‌లు ట్రెండింగ్‌లో ఉన్నాయి.

# ఇన్‌స్టాలో దుమ్మురేపిన ఫౌజీ

## ఫస్ట్‌లుక్ విడుదల కాగానే 5.33 లక్షల లైక్స్



రెబల్ స్టార్ ప్రభాస్ సినిమా అంటే థియేటర్లలో మాత్రమే కాదు, సోషల్ మీడియాలోనూ అభిమానుల సందడి ఏ స్థాయిలో ఉంటుందో మరోసారి నిరూపితమైంది. తాజాగా విడుదలైన ఫౌజీ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్ ఇన్‌స్టాగ్రామ్‌లో అరుదైన రికార్డును నమోదు చేసి, భారతీయ సినీ ప్రమోషన్లకు కొత్త బెంచ్‌మార్క్‌ను సెట్ చేసింది. తాజా గణాంకాల ప్రకారం, 'ఫౌజీ' ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదలైన తొలి 24 గంటల్లోనే ఏకంగా 5.33 లక్షల షేర్లు సాధించింది. దీంతో ఇన్‌స్టాగ్రామ్‌లో అత్యధికంగా షేర్ చేయబడిన సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌గా ఇది కొత్త రికార్డును సృష్టించింది. అభిమానులు ఈ పోస్టర్‌ను భారీ స్థాయిలో షేర్ చేస్తూ సోషల్ మీడియాలో ఒక డిజిటల్ వేడుకలా మార్చేశారు. ఈ రికార్డు ప్రభాస్ డిజిటల్ క్రేజ్‌కు మరో నిదర్శనంగా మారింది. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, ఈసారి ప్రభాస్ మరో హీరో రికార్డును కాదు, తన సొంత రికార్డునే బద్దలు కొట్టారు. గతంలో 'స్పిరిట్' ఫస్ట్ లుక్ పోస్టర్ 5.19 లక్షల షేర్లతో అగ్రస్థానంలో ఉండగా, ఇప్పుడు 'ఫౌజీ' దానిని అధిగమించి మొదటి స్థానాన్ని కైవసం చేసుకుంది. దీంతో సోషల్ మీడియాలో ప్రభాస్ ఆధిపత్యం మరింత బలపడిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ పోస్టర్ అభిమానులను అంతగా ఆకట్టుకోవడానికి ప్రధాన కారణం అందులో కనిపించిన ప్రభాస్ లుక్. ఒక వార్ ÷ట్ లో గాయాలతో కూర్చుని ఉన్న ఆ రూపం చాలా క్రేజీగా కనిపిస్తోంది. ఇప్పటికే ఈ చిత్రానికి సంబంధించిన ప్రతి అప్‌డేట్‌కు సోషల్ మీడియాలో అద్భుతమైన స్పందన లభిస్తోంది. ఫస్ట్ లుక్‌తో వచ్చిన ఈ రికార్డు సినిమా చుట్టూ ఉన్న హైప్‌ను మరింత పెంచింది. ప్రభాస్ అభిమానులతో పాటు, సినీ ప్రేక్షకులు కూడా ఈ సినిమాపై భారీ అంచనాలు పెట్టుకున్నారు. హను రాఘవపూడి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ పీరియడ్ వార్ డ్రామాను మైత్రి మూవీ మేకర్స్ నిర్మిస్తోంది. ప్రభాస్ పవర్‌ఫుల్ రోల్ లో తెరకెక్కుతున్న ఈ మూవీ డిసెంబర్ 3న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. విడుదలకు ఇంకా సమయం ఉన్నప్పటికీ, సోషల్ మీడియాలో ఇప్పటికే 'ఫౌజీ' సృష్టిస్తున్న సంచలనం చూస్తుంటే, ఈ సినిమా కోసం అభిమానులు ఎంత ఆసక్తిగా ఎదురుచూస్తున్నారో స్పష్టంగా తెలుస్తోంది.

# మరోమారు వార్తల్లో నటి నమిత

## స్లిమ్‌గా మారిన ఫోటోలతో నెటిజన్ల ఆసక్తి



ఒకప్పుడు టాలీవుడ్, కోలీవుడ్‌లో స్టార్ హీరోయిన్‌గా వరుస సినిమాలతో ప్రేక్షకులను అలరించిన నమిత ఇప్పుడు మరోసారి వార్తల్లో నిలిచారు. పెళ్లి తర్వాత సినిమాలకు దూరంగా ఉంటూ కుటుంబ జీవితంలో బిజీగా గడుపుతున్న ఆమె.. తాజాగా తన ఫిట్‌నెస్ ట్రాన్స్‌ఫర్మేషన్‌తో సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారారు.ఒకప్పుడు బొద్దుగా కనిపించిన నమిత.. ఇప్పుడు పూర్తిగా స్లిమ్‌గా మారి అభిమానులను ఆశ్చర్యపరుస్తున్నారు. జిమ్‌లో కఠినంగా వర్కౌట్స్ చేస్తున్న వీడియోను ఆమె తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో షేర్ చేశారు. మీ మనసు ఏదైతే నమ్ముతుందో.. మీ శరీరం దానినే అనుసరిస్తుంది అనే సందేశాన్ని కూడా ఆ వీడియోకు జత చేశారు. ఈ వీడియో వైరల్ కావడంతో అభిమానులు, నెటిజన్లు వరుసగా కామెంట్లు చేస్తున్నారు. ఇంత స్లిమ్‌గా మారారు ఏంటి?, నిజంగా ఇది నమితేనా?, స్టైలిష్ లుక్ అదిరిపోయింది అంటూ ప్రశంసలు కురిపిస్తున్నారు. చాలా మంది ఆమె కొత్త లుక్‌ను చూసి ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. నమిత సినీ ప్రయాణాన్ని పరిశీలిస్తే.. కన్నడ, తమిళ, తెలుగు, హిందీ భాషల్లో పలు చిత్రాల్లో నటించి మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. తెలుగులో 'సొంతం' సినిమాతో ఎంట్రీ ఇచ్చిన ఆమె.. 'ఒక రాజు ఒక రాణి', 'ఓ రాధ ఇద్దరు కృష్ణుల పెళ్లి', 'బిల్లా', 'నాయకుడు', 'సింహా', 'మన్యం పులి' వంటి చిత్రాల్లో నటించారు. ముఖ్యంగా బాలకృష్ణ నటించిన 'సింహా' సినిమాలో ఆమె గ్లామర్, నటన ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. పెళ్లి అనంతరం సినిమాలకు విరామం ఇచ్చిన నమిత గత కొన్నేళ్లుగా పూర్తిగా కుటుంబ జీవితానికే ప్రాధాన్యం ఇస్తున్నారు. అయితే తాజాగా ఆమె ఫిట్‌నెస్‌పై దృష్టి పెట్టి సరికొత్త లుక్‌లో కనిపించడంతో.. త్వరలోనే మళ్లీ వెండితెరపై రీఎంట్రీ ఇవ్వబోతున్నారా? అనే చర్చ సినీ వర్గాల్లో మొదలైంది. అయితే దీనిపై నమిత నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు.

# బేబీ బంప్‌తో రెబా మోనికా



తెలుగు ప్రేక్షకుల గుండెల్లో సామజవరగమన' సినిమాతో గుర్తింపు తెచ్చుకున్న మలయాళ ముద్దుగుమ్మ రెబా మోనికా జాన్. తన క్యూట్ ఎక్స్‌ప్రెషన్స్, సహజమైన నవ్వుతో సౌత్ ఇండియాలో ప్రత్యేకమైన క్రేజ్ సంపాదించుకున్న ఈ నటి, తాజాగా తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో షేర్ చేసిన కొన్ని ఫోటోలతో సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. థాయిలాండ్‌లోని పుకెట్ బీచ్ రిసార్ట్‌లో రెడ్ కలర్ ప్రింటెడ్ మ్యాక్సీ డ్రెస్ ధరించి, తన బేబీ బంప్‌ను చూపిస్తూ ఆమె దిగిన ఫోటోలు ఇప్పుడు ఇంటర్నెట్‌లో తెగ వైరల్ అవుతున్నాయి.ఆ హీరోయిన్ స్ట్రాంగ్ మెసేజ్ పెళ్లి తర్వాత కూడా కెరీర్‌లో దూకుడు: మోడలింగ్ బ్యాక్‌గ్రౌండ్ ఉన్న రెబా మోనికా జాన్ ట్రెడిషనల్ శారీస్ అయినా, మోడ్రన్ వెస్ట్రన్ వేర్ అయినా చాలా స్టైలిష్‌గా క్యారీ చేస్తుంది. ఈమె 2022 జనవరిలో తన చిరకాల మిత్రుడు జోమోన్ జోసెఫ్‌ను వివాహం చేసుకున్నారు. ఇక ఇక పెళ్లి తర్వాత కూడా సినిమాల్లో ఎంతో యాక్టివ్‌గా ఉంటున్న ఈ బ్యూటీ, తెలుగులో సామజవరగమన తో పాటు మృత్యుంజయ్, మ్యాడ్ స్క్వేర్ వంటి క్రేజీ చిత్రాలతో టాలీవుడ్‌లో మంచి గుర్తింపు తెచ్చుకుంది.ప్రస్తుతం ప్రెగ్నెంట్‌గా ఉన్న రెబా, ద నాకా పుకెట్ రిసార్ట్‌లో వెకేషన్‌ను ఫుల్‌గా ఎంజాయ్ చేస్తోంది. అక్కడ బీచ్ ఒడ్డున వైబ్రెంట్ రెడ్ ప్రింటెడ్ స్ట్రాపీ మ్యాక్సీ బీచ్ డ్రెస్ ధరించి సరికొత్తగా ఫోటోలకు పోజులిచ్చింది. హై లెగ్ స్లిట్ ఉన్న ఈ డ్రెస్‌లో ఆమె తన మెటర్నిటీ లుక్‌ను ఎంతో కాన్ఫిడెంట్‌గా ప్రదర్శించింది. ఇక ఇక ఆమె ముఖంలో కనిపిస్తున్న ప్రెగ్నెన్సీ గ్లో చూసి అభిమానులు మురిసిపోతున్నారు. "ప్రెగ్నెన్సీ గ్లో అనేది నిజంగానే అద్భుతం" అంటూ నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు.

# నాని ప్యారడైజ్‌కు భారీ డిమాండ్



నాచురల్ స్టార్ నాని నటిస్తున్న తాజా చిత్రం 'ది ప్యారడైజ్' విడుదలకు ముందే ట్రేడ్ వర్గాల్లో భారీ రికార్డ్స్ సృష్టిస్తుంది. 'దసరా' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత దర్శకుడు శ్రీకాంత్ ఓదెలతో నాని మరోసారి జతకట్టడంతో ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు ఏర్పడ్డాయి. ఇప్పుడు ఆ అంచనాలకు తగ్గట్టుగానే ఈ చిత్రం థియేట్రికల్ బిజినెస్‌లో కొత్త రికార్డులు సృష్టిస్తుంది. తాజా సినీ వర్గాల సమాచారం ప్రకారం.. 'ది ప్యారడైజ్' నైజాం థియేట్రికల్ హక్కులను మైత్రీ డిస్ట్రిబ్యూటర్స్ రూ.37 కోట్లకు సొంతం చేసుకుంది. నాని కెరీర్‌లో ఇప్పటివరకు ఏ చిత్రానికీ ఈ స్థాయిలో నైజాం బిజినెస్ జరగకపోవడంతో ఇది రికార్డు డీల్‌గా నిలిచింది. సినిమా విడుదలకు ఇంకా సమయం ఉండటంతో ఇతర ప్రాంతాల నుంచి కూడా భారీ ఆఫర్లు వచ్చే అవకాశాలు ఉన్నాయని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

# ఓటిటిలోకి బాలన్..ది బాయ్



'మంజుమ్మల్ బాయ్స్' చిత్రంతో మలయాళంతో పాటు తెలుగులోనూ మంచి గుర్తింపు తెచ్చుకున్నారు దర్శకుడు చిదంబరం. ఆయన దర్శకత్వంలో వచ్చిన చిత్రం 'బాలన్ - ది బాయ్'. చందు సలీమ్ కుమార్, టొవినో థామస్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సినిమా ఇటీవల విడుదలై పాజిటివ్ టాక్‌ను సొంతం చేసుకుంది. ఇప్పడీ సినిమా ఓటీటీలోకి వచ్చేందుకు సిద్ధమైంది. జులై 31 నుంచి జీ5 వేదికగా స్ట్రీమింగ్ కానుంది. మలయాళంతో పాటు తెలుగు, హిందీ, తమిళ, కన్నడ భాషల్లో అందుబాటులోకి రానుంది. హత్య కేసులో జైలుకు వెళ్లిన మహిళ అక్కడ ఓ అబ్బాయికి జన్మనిస్తుంది. శిక్ష పూర్తయి బయటకు వచ్చాక తన గతం గురించి ఎవరికీ చెప్పకుండా మారుపేర్లతో అన్ని ప్రాంతాలు తిరుగుతూ ఉంటుంది. కల్లోలభరితమైన బాల్యం, ఆ తర్వాత అదృశ్యమైన తన తల్లి కోసం వెతుకుతున్న ఒక టీనేజ్ అబ్బాయి కథగా 'బాలన్ - ది బాయ్' రూపొందింది. మే నెలలో జరిగిన కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లోనూ ఈ చిత్రాన్ని ప్రదర్శించారు. సినీ ప్రముఖులు సూర్య, నాగచైతన్య తదితరులు ఈ సినిమాపై ప్రశంసలు కురిపించారు.

# డాక్టర్ సోమశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో పాణ్యంలో ఉచిత వైద్య సేవలు






**పాణ్యం ప్రతినిధి జులై 19, (ప్రజా రిపబ్లిక్ న్యూస్),** స్థానిక కె.వి.ఆర్ హాస్పిటల్ నుంచి డాక్టర్ సోమశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో పాణ్యం లోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు హాస్పిటల్ నుంచి డాక్టర్ జయ రామకృష్ణ,(ఇంటర్వెన్షన్ న్యూరాలజిస్ట్), డాక్టర్ నిత్య (పీడియాట్రిక్ ఇన్సెంటివ్ కేర్ స్పెషలిస్ట్). పాల్గొని ప్రజలకు వైద్య సేవలు అందించారు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు వైద్య శిబిరం నిర్వహించడం. జరిగింది ఈ వైద్య శిబిరంలో పక్షవాతము, మెదడు, నరాల సమస్యలు, చిన్నపిల్లల వ్యాధులకు పరీక్షలు నిర్వహించి వారికి ఉచితంగా మందులను అందించడం జరిగింది ఆరోగ్య సూత్రాలు పాటించాలని ప్రతి ఒక్కరు వ్యక్తిగత శుభ్రత పరిసరాల పరిశుభ్రత పాటించాలని డాక్టర్లు కోరారు. ఏ వైద్య శిబిరంలో 236 మందికి పరీక్షలు, వైద్య సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో కె.వి.ఆర్ హాస్పిటల్స్ సిబ్బంది పాల్గొన్నారు

# విజయవంతంగా ముగిసిన రాష్ట్రస్థాయి సీనియర్ చెస్ ఛాంపియన్ షిప్ పోటీలు

**జాతీయ సాయి పోటీలకు ఎంపికైన మహేంద్ర తేజ(గుంటూరు), స్వర్ణ నిహాల్(తిరుపతి), ఆదిత్య(ఎన్టీఆర్ జిల్లా), దుర్వేశ్(గుంటూరు)**

**బహుమతి ప్రధానం చేసిన ఆంధ్రప్రదేశ్ చెస్ అసోసియేషన్ వైస్ చైర్మన్ డాక్టర్ జి. రవి కృష్ణ**



**నంద్యాల జూలై 19( రిపబ్లిక్ న్యూస్) :** ఆంధ్రప్రదేశ్ చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నంద్యాల జిల్లా చెస్ సంఘం నిర్వహణలో, నంద్యాల జిల్లా చెస్ సంఘం కార్యదర్శి రామసుబ్బారెడ్డి పర్యవేక్షణలో గత రెండు రోజులుగా నంద్యాల రామకృష్ణ పీజీ కళాశాలలో జరిగిన రాష్ట్రస్థాయి సీనియర్ చెస్ ఛాంపియన్ షిప్ పోటీలు ఆదివారం సాయంత్రం విజయవంతంగా ముగిసాయి.

ఈ సందర్భంగా నంద్యాల జిల్లా చెస్ సంఘం అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ చెస్ అసోసియేషన్ వైస్ చైర్మన్ డాక్టర్ రవి కృష్ణ అధ్యక్షతన, జిల్లా చెస్ సంఘం కార్యదర్శి రామసుబ్బారెడ్డి నిర్వహణలో జరిగిన బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమంలో రామకృష్ణ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ సుబ్బయ్య, నంద్యాల లయన్స్ క్లబ్ అధ్యక్షులు సందీప్, జోన్ చైర్మన్ సోమేశుల నాగరాజు అతిథులుగా పాల్గొని రాష్ట్రస్థాయి విజేతలకు, వివిధ వయసు కేటగిరీలలో స్థానాలు సంపాదించిన క్రీడాకారులకు ట్రోఫీలు, పతకాలు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ క్రీడలలో పాల్గొన్నప్పుడు విజయం సాధించాలనే పట్టుదలతో ఆడాలని, విజేతలుగా నిలిచిన వారు తిరిగి గెలవాలనే ఆకాంక్షతో,విజయం సాధించని వారు భవిష్యత్తులో విజయం సాధించడానికి క్రమశిక్షణతో కూడిన నిరంతర సాధన ద్వారా విజయాలు సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా చెస్ సంఘం కార్యదర్శి రామసుబ్బారెడ్డి ,రామకృష్ణ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ సుబ్బయ్య, నంద్యాల లయన్స్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు సందీప్, మేడా చంద్రశేఖర్, కోశాధికారి సురేష్, జోనల్ చైర్మన్ సోమేశుల నాగరాజు, చీఫ్ ఆర్బిటర్ వెంకట కుమార్, జిల్లా సంఘం సంయుక్త కార్యదర్శి రాజా రమేష్ చక్రవర్తి, ఆంధ్రప్రదేశ్ చెస్ అసోసియేషన్ కమిటీ సభ్యులు కర్నూలు జిల్లా చెస్ సంఘం కార్యదర్శి కామిశెట్టి శ్రీనివాస్,ప్రతినిధులు నాగ శ్రీనిష్, ఇమామ్, వ్యాయామ ఉపాధ్యాయులు మాలిక్ భాష, శంకర్, ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లాల నుండి వచ్చిన 224 మంది క్రీడాకారులు, కోచ్ లు, క్రీడాకారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

**జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన రాష్ట్ర జట్టు క్రీడాకారులు**

నంద్యాలలో జరిగిన రాష్ట్రస్థాయి సీనియర్ ఛాంపియన్ షిప్ పోటీలలో వరస స్థానాలు సాధించి విజేతలుగా నిలిచిన గుంటూరు కు చెందిన మేకల మహేంద్ర తేజ, తిరుపతికి చెందిన స్వర్ణ నిహాల్, ఎన్టీఆర్ జిల్లాకు చెందిన ఆదిత్య, గుంటూరు కు చెందిన దొండపాటి దుర్వేశ్ లు ట్రోఫీలు, నగదు బహుమతులు అందుకోవడమే కాకుండా, జాతీయ స్థాయి పోటీలలో రాష్ట్రం తరపున పాల్గొనే రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారు.

# శ్రీ సుబ్రమణేశ్వర ఆలయంలో గుంటూరు జిల్లా జడ్జి ప్రత్యేక పూజలు



**పాణ్యం ప్రతినిధి జులై 19( రిపబ్లిక్ న్యూస్) :** న్యూస్ స్థానిక మండలం కొత్తూరు సుబ్బరాయుడు సన్నిధిలో గుంటూరు జిల్లా జడ్జి పూజలు. ప్రముఖ శైవ క్షేత్రం పాణ్యం మండలం ఎస్ కొత్తూరు గ్రామంలో వెలిసియున్న శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి సన్నిధిలో గుంటూరు జిల్లా జడ్జి కోల్లపూడి కిషోర్ ఆదివారం పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు నారాయణస్వామి కృష్ణయ్య స్వామి ఆలయ సిబ్బంది ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి శ్రీ స్వామివారికి అభిషేకము అర్చనలు విశేష పూజలు నిర్వహించారు అనంతరం జడ్జి గారికి ఆశీర్వాద మండపం నందు శేష వస్త్రములతో పూల మాలలతో ఘనంగా సత్కరించి ప్రసాదము అందజేసి ఆశీర్వదించారు ఈ కార్యక్రమంలో అర్చకులు నాగమయ్య, కిట్టయ్య స్వామి, ప్రధాన అర్చకులు నారాయణ శర్మ పురుషోత్తం రెడ్డి, ఆలయ అధికారి సుబ్బా రెడ్డి తదితరులు పాల్గొన్నారు

# ఐఎంఏ ఆధ్వర్యంలో వైద్య సదస్సు

**నంద్యాల ఐఎంఏ, కర్నూలు కామినేని జెమ్ కేర్ క్యాన్సర్ ఆసుపత్రి సంయుక్త నిర్వహణ**

**వక్తలుగా పాల్గొన్న క్యాన్సర్ శస్త్ర చికిత్స నిపుణులు డాక్టర్ కొల్లా మోహన్ రెడ్డి, క్యాన్సర్ రేడియేషన్ నిపుణులు డాక్టర్ సమీర్ హుస్సేన్**

**సదస్సు ప్రారంభించిన ఐఎంఏ జాతీయ కేంద్ర కమిటీ సభ్యులు డాక్టర్ రవి కృష్ణ**




**నంద్యాల జూలై 19( రిపబ్లిక్ న్యూస్) :** నంద్యాల ఐఎంఏ ఆధ్వర్యంలో కర్నూలు కామినేని జెమ్ కేర్ క్యాన్సర్ ఆసుపత్రి సహకారంతో స్థానిక హోటల్ సమావేశ భవనంలో నంద్యాల ప్రాంత వైద్యులకు నిరంతర వైద్య విద్యా సదస్సు నిర్వహించారు. నంద్యాల ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్ శ్రీనివాస్ అధ్యక్షతన, కార్యదర్శి డాక్టర్ మహమ్మద్ రఫీ నిర్వహణలో జరిగిన ఈ కార్యక్రమంలో ఐఎంఏ జాతీయ కేంద్ర కమిటీ సభ్యులు, ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొని సదస్సు ప్రారంభించారు.

కర్నూలు కామినేని జెమ్ కేర్ ఆసుపత్రి క్యాన్సర్ శస్త్ర చికిత్స నిపుణులు డాక్టర్ కొల్లా మోహన్ రెడ్డి, క్యాన్సర్ రేడియేషన్ నిపుణులు డాక్టర్ సమీర్ హుస్సేన్ ముఖ్య వక్తలుగా పాల్గొని మల్టీమీడియా సహకారంతో ప్రసంగించారు. డాక్టర్ కొల్లా మోహన్ రెడ్డి రొమ్ము క్యాన్సర్ శస్త్ర చికిత్సలో నూతన విధానాలపై, వైద్యులకు అవగాహన కల్పించారు. డాక్టర్ సమీర్ హుస్సేన్ "రొమ్ము క్యాన్సర్ చికిత్స లో రేడియేషన్ పాత్ర" అంశంపై ప్రసంగించారు డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ వైద్యులు ప్రాక్టీస్ చేసినంత కాలం తమ వైద్య పరిజ్ఞానాన్ని నిరంతరం పెంచుకుంటూ ఉండాలని, తద్వారా నూతన వైద్య విధానాలు, ఆధునిక పరికరాలపై అవగాహన కలిగి ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి ఆస్కారం ఏర్పడుతుందన్నారు. ఈ లక్ష్యం కోసమే వైద్యుల కోసం నిరంతర వైద్య విద్యా సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ నంద్యాల అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ శ్రీనివాస్ రావు, డాక్టర్ మహమ్మద్ రఫీ, ఐఎంఏ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ పనిల్ కుమార్, ఐఎంఏ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులు డాక్టర్ మధుసూదన రెడ్డి, సీనియర్ వైద్యులు డాక్టర్ సహదేవుడు, కర్నూలు కామినేని జెమ్ కేర్ ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ మరియు సీఈవో డాక్టర్ చంద్రశేఖర్, ముఖ్య పరిపాలన అధికారి షేక్షావలి, డీజీఎం రంజిత్ కుమార్, మేనేజర్ జకారియా, అధిక సంఖ్యలో నంద్యాల వైద్యులు, పాల్గొన్నారు.

# జిల్లా వ్యాప్తంగా పోలీస్ స్టేషన్ ల పరిధిలోని రౌడీషీటర్లకు, నేరచరిత్ర కలిగిన వారికి కౌన్సిలింగ్

**నేర ప్రవృత్తికి స్వస్తి పలికి సమాజంలో మంచి పౌరులుగా మెలగాలి**





**నంద్యాల క్రైం, జూలై 19, (రిపబ్లిక్ న్యూస్):** జిల్లాలో నేరనియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ఆదివారం జిల్లా వ్యాప్తంగా పోలీసు అధికారులు వారి పోలీస్ స్టేషన్ల పరిధిలో నివసిస్తున్న రౌడీ షీటర్లకు ,నేరచరిత్ర గలవారికి, చెడు నడత కలిగిన వ్యక్తులకు సత్ప్రవర్తనతో జీవించాలని, నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని కౌన్సెలింగ్ నిర్వహించారు. అనంతరం ప్రస్తుతం వారు జీవిస్తున్న విధానం, జీవనోపాధికి చేస్తున్న వృత్తులపై ఆరా తీశారు. అసాంఘిక, చట్ట వ్యతిరేక కార్యకలాపాలలో పాల్గొన్న రాదని మీపై నిరంతరం నిఘా ఉంటుందని,పోలీసుల మాటలను వినకుండా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే పీడీ యాక్ట్, బైండోవర్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని పోలీస్ అధికారులు హెచ్చరించారు.

# నంద్యాల రెండవ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్





**నంద్యాల క్రైం, జూలై 19, (రిపబ్లిక్ న్యూస్):** నంద్యాల రెండవ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని విశ్వనగర్ ప్రాంతంలో ఇన్స్పెక్టర్ అస్రార్ భాష ఆధ్వర్యంలో ఆదివారం పోలీసు సిబ్బంది కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్లు నిర్వహించారు. ఈ ఆపరేషన్‌లో భాగంగా అనుమానితులు, రౌడీ షీటర్లు, నేరచరిత్ర కలిగిన వ్యక్తుల నివాసాల్లో విస్తృతంగా సోదాలు నిర్వహించారు. అలాగే సరైన ధ్రువపత్రాలు లేని వాహనాలను స్వాధీనం చేసుకొని, వాటిపై చట్టపరమైన చర్యలు చేపట్టారు. అనంతరం స్థానిక ప్రజలతో సమావేశం నిర్వహించి, శాంతిభద్రతల పరిరక్షణ, నేర నియంత్రణ కోసం పోలీసులు చేపడుతున్న చర్యలపై అవగాహన కల్పించారు. చట్టవ్యతిరేక, అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, నేరానికి పాల్పడిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే తమ ప్రాంతంలో ఎవరైనా అనుమానాస్పదంగా సంచరిస్తున్నట్లు లేదా చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు గుర్తించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా అత్యవసర సేవల టోల్ ఫ్రీ నంబర్లు 100 / 112కు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. సమాచారం అందించిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ప్రజల భాగస్వామ్యంతో నేరాలను అరికట్టి, శాంతిభద్రతలను మరింత పటిష్ఠం చేయడానికి నంద్యాల పోలీసులు నిరంతరం కృషి చేస్తున్నారని ఈ సందర్భంగా వెల్లడించారు.

# పిల్లలు చేసిన పీర్ల స్వాములకు ఘనంగా గ్రామోత్సవం

**- గాజులపల్లెలో ఆకట్టుకున్న చిన్నారుల భక్తిశ్రద్ధలు**

**- చిన్నారులను అభినందించిన గ్రామస్తులు**



**మహానంది, జూలై 19,( రిపబ్లిక్ న్యూస్)**మహానంది మండలం గాజులపల్లెలో మౌలాలి స్వామి, లాల్ షా వలి స్వామి జాతరల సందర్భంగా గ్రామంలో ఇటీవల ఉత్సవాలు వైభవంగా నిర్వహించిన విషయం తెలిసిందే. ఉత్సవాల అనంతరం ప్రతి ఏడాది గ్రామానికి చెందిన పిల్లలు వివిధ మాఖానాల్లో కొలువైన పీర్ల స్వాములను తయారుచేసి ఉత్సవం చేస్తుంటారు. అందులో భాగంగా ఆదివారం పిల్లలు స్వయంగా తయారు చేసిన పీర్ల స్వాములకు గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. పిల్లలు సొంతంగా పీర్లను తయారు చేసి, వాటిని పూల మాలలు, బాసికాలు, తగరపు కాగితాలతో విశేషంగా అలంకరించి గ్రామంలో ఊరేగించిన దృశ్యం వారిలోని ఆధ్యాత్మిక భావాన్ని చాటి చెప్పింది. బాలల ఉత్సాహాన్ని, ప్రతిభను చూసి గ్రామస్థులందరూ వారిని అభినందించారు.

printed and published by B.Nagendra on behalf of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: BOJJANAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic144@gmail.com